ప్రజాశక్తి
శనివారం 31 ఆగస్టు 2024
8 పేజీలు





సిఎం సారూ.. ఇటు చూసేరా..?

- జిల్లాను వేధిస్తున్న అనేక సమస్యలు - నేడు జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ట వేశాయి. జిల్లా వాసులకు అనేక తిప్పలు తప్పడం లేదు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓర్వకల్లు మండల కేంద్రంలో పింఛన్ల పంపిణీలో పాల్గొనున్నారు. గ్రామస్తులతో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

తప్పని వలస వెతలు : ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి.ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు : కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసల్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.


సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్ర: జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగు నీటికి తిప్పలే : ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్సి, హెచ్ఎల్సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హొళహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తి అయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత : కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులను కూడా కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.











అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాతృ మరణాలను నివారించాలి

- ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

మాతృ మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు వివరించి, చైతన్య పరచాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకర్, సూపర్‌వైజర్ సావిత్రి తెలిపారు. శుక్రవారం ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 12 వారాలు పూర్తి కాకుండానే గర్భిణీ వివరాలను పొందుపరచాలన్నారు. తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని తెలిపారు. గర్భిణుల వివరాలను ఎఎన్ఎంలకు అందిస్తూ వారి సహకారంతో గర్భంలోని పిండం ఆరోగ్యంగా ఉండేలా, రక్తహీనత ఏర్పడకుండా మందుల వాడకం గురించి వివరించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకునేలా చూడాలన్నారు. రక్తహీనత కారణంగానే మాతృ మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని అరికట్టాలని తెలిపారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌ను మార్చాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని



పైకప్పును చూపుతున్న నాయకులు

పట్టణంలోని శివారులో ఉన్న ఎస్సీ బాలుర కళాశాల విద్యార్థుల వసతి గృహాన్ని వేరే భవనంలో మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే విద్యార్థులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, పైకప్పు పెచ్చులూడి పడుతోందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే భవనం మరమ్మతుల కోసం గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మరమ్మతులు కాకుండా ప్రస్తుతం భవనం పటిష్టంగా నిర్మాణం చేపట్టి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు శేఖర్, నాగరాజు, నాయకులు రాజు, మహేష్, గౌస్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో వర్గీకరణ వద్దు...

- మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

ప్రజాశక్తి - ఆలూరు

ఎబిసిడి వర్గీకరణను ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయరాదని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది కోరారు. శుక్రవారం ఆలూరు గెస్ట్ హౌస్‌లో జెట్టప్ప గారి వీరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎబిసిడి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా మాలలందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. దళితుల ఐక్యతను దెబ్బ తీసే విధంగా ఈనెల 1న సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం విచారకరమని తెలిపారు. బిజెపి, టిడిపి ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని మార్చే విధంగా రిజర్వేషన్లను ఎత్తివేసే విధంగా కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఎబిసిడి వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఐక్యమత్యంగా పోరాడాలని కోరారు. వెంకటరాముడు, భరత్, లింగంపల్లి మల్లికార్జున, లక్ష్మన్న, ఈరన్న, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహానంది

యుపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

యుపిఎస్‌కు వ్యతిరేకంగా యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గాదిలింగ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, ఆడిట్ సభ్యులు మల్లికార్జున మాట్లాడారు. 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు న్యూ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తోందని తెలిపారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీం ఉద్యోగుల హక్కు అని, భిక్ష కాదని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం ఖాతరు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ను అమలు చేస్తున్నాయని తెలిపారు. 20 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేసిన ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని చెప్పారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం సిపిఎస్ స్థానంలో జిపిఎస్ మెరుగైందని నమ్మబలికిందని, ఉద్యోగ, ఉపాధ్యాయులు జిపిఎస్‌ను తిరస్కరించారని తెలిపారు. జిపిఎస్‌కు మరో రూపంగా ఉన్న యుపిఎస్‌ను కేంద్ర కేబినెట్ ఆగస్టు 22న ఆమోదించిందని, యుపిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సూచనలు చేసిందని చెప్పారు. పాత పెన్షన్‌కు ఎక్కడా పోలిక లేని యుపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎల్‌కె.బసప్ప, బాలాజీ రావు, నరసయ్య గౌడ్, ఆవుల బసప్ప, శివకుమార్ గౌడ్, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, లింగన్న, రంగారెడ్డి, రంగన్న, ఈరన్న, మహాదేవ, మోదిన్ బాష, రాముడు, నాగేష్, రమేష్, రంగన్న, రాజేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయం దగ్గర నిరసన చేపట్టారు. యుటిఎఫ్ నాయకులు ఎస్.దావీదు, ఎస్.నాగమణి, జె.ఎల్లప్ప, జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు, నాయకులు డి.కౌలన్న, మల్లారి నాగరాజు, ఎం.రాజ, చంద్రపాల్, పరిగె ప్రకాష్, బి.రాఘవేంద్ర, శివకుమార్, నీలి నాగరాజు, ప్రశాంత్, భూపాల్, రమేష్, శంకర్ నాయక్, భీమేష్, శాంతిరాజు, రామాంజనేయులు, సుధాకర్, జి.బాబు, హనీఫ్, కృష్ణ, హనుమంతు, అయ్యస్వాములు, హుస్సేని, భాస్కర్, జి.బాబు, అశోక్ కుమార్, సంజన్న, వీరేష్, తాతయ్య పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ఆందోళన చేస్తున్న నాయకులు



ఆదోని తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న నాయకులు

శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇవ్వండి

- వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద చారి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద చారి, ఎమ్మెల్యే పిఎ వెంకట్రామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మాబుసాబ్, సర్పంచి పాల్ దినకర్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి కోరారు. శుక్రవారం కౌతాళం సిఐగా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో ప్రజలు ఇలాంటి ఇబ్బందులూ పడకుండా సేవలు అందించాలని కోరారు. ఉప సర్పంచి సక్కిర తిక్కయ్య, మాజీ సర్పంచి అవతారం, వడ్డే రామన్న, సీనియర్ నాయకులు సత్యప్ప స్వామి, అబ్దుల్ సమద్, వార్డ్ మెంబర్ రామకృష్ణ, వడ్డే హుస్సేని పాల్గొన్నారు.



సిఐని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనది

- ఎంఇఒ నిర్మల

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైందని, ప్రతి విద్యార్థీ గురువును ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో చదివి అభివృద్ధి చెందాలని ఎంఇఒ నిర్మల, సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి విరమణ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు జ్యోతిని ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి ఘనంగా సన్మానించారు. మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, రోషన్న పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న సర్పంచి అరుణ్ కుమార్

'కామర్స్'తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- దేశ వాణిజ్య, వ్యాపార గమనం కామర్స్‌తోనే సాధ్యం - రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కామర్స్ కోర్సుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన డిగ్రీ బీకాం చదువుతున్న ఫస్ట్, సెకండ్, థర్డ్ ఇయర్ విద్యార్థులకు 'కామర్స్ కోర్సు - ఉద్యోగ, ఉపాధి అవకాశాల'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మిగనూరు జిఎస్‌టి కన్సల్టెంట్ సాంబశివ హాజరయి మాట్లాడారు. కామర్స్ కోర్సు చదవడం వల్ల డిగ్రీ పూర్తి కాగానే క్యాట్, జిఎస్‌టి, సాఫ్ట్ వేర్ పరంగా శ్యాప్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా వివిధ బ్యాంకింగ్ రంగాలోనూ, ఇన్‌కమ్ టాక్స్ (ఆదాయపు పన్ను) ఇంటెలిజెన్స్ బ్యూరో, సిఎ, సిడబ్ల్యు, వివిధ ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో అకౌంటెంట్ ఉద్యోగాలు, వివిధ ప్రయివేట్ కంపెనీల్లోనూ, మరెన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి కామర్స్ సబ్జెక్టుల పట్ల భయం వీడి కామర్స్‌లో నైపుణ్యత సాధించాలని చెప్పారు. అనంతరం కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి మాట్లాడారు. దేశ వాణిజ్య, వ్యాపారాల గమనం కామర్స్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ టెక్నికల్ స్కిల్స్ మెరుగుపరచుకొని బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఏటా కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కామర్స్ విద్యార్థులే పొందుతున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, బీకాం హెచ్ఒడి విజయ్ కుమార్, కామర్స్ అధ్యాపకులు వీరేష్, కంప్యూటర్ అధ్యాపకులు రామకృష్ణ, నందిని, బిబిఎ అధ్యాపకులు విజయరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

కంప్యూటరీకరణకు జిరాక్స్ కాపీలు ఇవ్వండి

- బెల్డోనా సొసైటీ సిఇఒ హరికృష్ణ

ప్రజాశక్తి - చిప్పగిరి



ప్రభుత్వ ఆదేశాల మేరకు బెల్డోనా సహకార రంగంలో రుణాలు పొందిన రైతులందరూ జిరాక్స్ కాపీలను సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సిఇఒ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులందరూ ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలను సొసైటీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఈ జిరాక్స్ కాపీలతో కంప్యూటరీకరణలో బయోడేటాను పొందుపరుస్తామని తెలిపారు.

వైభవంగా ఉలిగమ్మ అవ్వ కుంభోత్సవం

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలో వెలసిన ఉలిగమ్మ అవ్వ కుంభోత్సవం రజకుల ఆధ్వర్యంలో అశేష జనుల మధ్య వైభవంగా సాగింది. శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఈ కుంభోత్సవాన్ని గ్రామంలో పెద్దబావి వద్ద నుంచి గంగిపూజ చేశారు. అనంతరం భక్తులు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో కుంభాన్ని పురవీధుల గుండా ఊరేగింపుగా స్థానిక చాకలి వీధి వద్ద వెలసిన ఉలిగమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ఆకుపూజ, మహా మంగళారతి, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మహిళలు, చిన్నారులు నైవేద్యం సమర్పించారు. భక్తులకు రజక సంఘం, గ్రామ పెద్దలు అన్నదానం ఏర్పాటు చేశారు.

3న ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెప్టెంబర్ 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత మంగళవారం జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఈ జాబ్ మేళాలో ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్, పేటీఎం, ఆమర రాజ గ్రూప్, కెఎల్ గ్రూప్, నవ భారత ఫర్టిలైజర్స్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ, పిజి, చదివి 18 - 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని అన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 నుంచి రూ.18 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9010003132 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఇసుక రీచ్‌లపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని తుంగభద్ర నదీతీరంలో ఇసుక రీచ్‌ల వల్ల లాభనష్టాలపై గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని గుడికంబాళి, మురళి, నదీచాగి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ హరిత ట్రిబ్యునల్, గనుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇసుక రీచ్ వల్ల పంచాయతీలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులుంటే ఈ గ్రామ సభలో అర్జీ రూపంలో అందించవచ్చని చెప్పారు. ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికి తెగుళ్లు

- విలవిల్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

పత్తి పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. దేవనకొండ మండల వ్యాప్తంగా వర్షాలు ఒకే మాదిరిగా కురవలేదు. కొన్ని గ్రామాల్లో అధిక వర్షాలు కురవగా.. మరికొన్ని గ్రామాల్లో అసలే వర్షాలు కురవలేదు.



తెగులు సోకిన పత్తి పంట

రైతులు సాగు చేసిన పత్తి పంటకు తెగుళ్ల సోకాయి. రైతులు విలవిల్లాడుతున్నారు. మండల వ్యాప్తంగా రైతులు అత్యధికంగా 35 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. దేవనకొండ క్రాస్ రోడ్డు, వరిముక్కల, అలారుదిన్నె, కుంకునూరు, కరివేముల, పొట్లపాడు, కొత్తపేట, కప్పట్రాళ్ల , గద్దరాళ్ల, పల్లెదొడ్డి గ్రామాల్లో గత నెల రోజుల నుంచి వర్షాలు కురవలేదు. రైతులు సాగు చేసిన వేరుశనగ, పత్తి, టమోటా, ఆముదం, సజ్జ, కంది పంటలు దెబ్బ తిన్నాయి. పంట దిగుబడులు లేక తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. పత్తి పంటకుకు నల్లి, పేనుబంక, ఎర్ర తెగుళ్ల సోకడంతో పంట చేతికి వచ్చే సమయంలో పూత, సట్టా రాలిపోయి పత్తి మొక్కలు వడలిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా పత్తి విత్తినప్పటి నుంచి కలుపు తీయడం, పిచికారి, ఎరువులు వేయడం వంటి పెట్టుబడి సుమారు రూ.30 వేలు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. తెగుళ్ల సోకడంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎర్ర తెగుళ్లతో పంట దెబ్బతినింది

- రైతు శ్రీనివాసులు, వెలమకూరు గ్రామం



రెండెకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేశాను. పంట చేతికి వచ్చే సమయంలో ఎర్ర తెగులు సోకడంతో పూత, సట్టా రాలి పోయి పంట దిగుబడిపై ప్రభావం చూపుతోంది. దిగుబడి లేక నష్టం మూటగట్టుకోవాల్సి పరిస్థితి ఉంది. ఎకరా పత్తి సాగుకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎర్ర తెగుళ్లతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఎఒ సురేష్ బాబు



మండలంలో పత్తి పంటకు వాతావరణ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో ఆకుమచ్చ, ఎర్ర తెగుళ్ల సోకిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకు రైతులు కాంటాఫ్ అనే మందు ఒక మిల్లీలీటర్ ఒక లీటర్ నీటికి, 19:19:19 5 గ్రాములు 1 లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పేను బంక తెగులు సోకిన పత్తి రైతులు డైఫాన్ మైత్రిన్, అసిటా మై ఫ్రైడ్ వంటి మందులను పిచికారి చేసుకోవాలి.



పూలమాల వేస్తున్న వీరభద్ర గౌడ్

తండ్రి విగ్రహం ఏర్పాటు చేసిన కుమారుడు

ప్రజాశక్తి -దేవనకొండ

జన్మనిచ్చిన తండ్రిని మర్చిపోకూడదని కుమారుడు రాజయ్య ఏకంగా తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం టిడిపి గ్రామ నాయకులు రాజయ్యకు చెందిన భారత్ పెట్రోల్ బంకు ఆవరణలో ఆయన తండ్రి, మాజీ సర్పంచి వెంకటరత్నం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, ఆయన కుమారుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'

ప్రజాశక్తి - ఆదోని

అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానం చేయడంతో సమానమని ఇండియన్ రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్, ఆదోని జనసేవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు విరుపాక్షి స్వామి, డాక్టర్ ప్రసాద్, కోచింగ్ సెంటర్ ప్రిన్సిపల్ వరుణ్ గాంధీ, రెడ్ క్రాస్ రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆదోని నుంచి వెళ్లి విశాఖపట్టం జిల్లా భీమిలిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని 23వ సారి రక్తదానం చేసిన ఫొటోగ్రాఫర్ హుసేన్ పీరాను అభినందించారు. హుసేన్ పీరాను ఆదర్శంగా తీసుకొని స్నేహితులు, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి దాదాపు 60 మంది రక్తదానం చేశారన్నారు. అనంతర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. హుస్సేన్ పీరా, జగదీశ్, శంకర్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడ : డిఇఇ నీరజ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మొక్కల పెంపకం మానవ మనుగడకు అవసరమని మున్సిపల్ డిఇఇ నీరజ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలో నాయీ బ్రాహ్మణ కాలనీ, సోగనూరు రోడ్డు, శివన్న నగర్, అర్బన్ హెల్త్ సెంటర్ ఏరియాల్లో మొక్కలు నాటారు. డిఇఇ విక్టర్, కౌన్సిల్ సభ్యులు రామదాసు గౌడ్, అమానుల్లా పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు

అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, రూరల్ మండల కార్యదర్శి శైలజ, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు కోరారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ బంగారమ్మకు జిఒ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోరాటాల ఫలితంగా జిఒ వచ్చిందని తెలిపారు. గౌరవ వేతనంతో పనిచేసే అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. ఇంటి స్థలం, గృహం తదితర పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఎంపిడిఒ స్పందించి హామీ ఇచ్చారు.



ఎంపిడిఒకు జిఒ కాపీని అందజేస్తున్న నాయకులు

ఆంజనేయ పాత్రధారి అక్బర్‌బాష కన్నుమూత

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

ప్రముఖ రంగస్థల నటుడు ఆంజనేయ పాత్రధారిఅక్బర్ బాష అనారోగ్యంతో తుదిస్వాస విడిచారు. కర్నూలు జిల్లా రంగస్థల వేదికలపై 800 సార్లు ఆంజనేయ పాత్రవేసి "భళారే ఆంజనేయ" అనిపించుకున్న అక్బర్ బాష అనారోగ్య కారణాల రిత్యా శుక్రవారం ఉదయం పదిగంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కన్నుమూశారు. చిన్నతనం నుండి అనేకమంది గురువుల దగ్గర భారత భాగవత రామాయణ రంగస్థల పాత్రలపై తనదైన శైలిలో ప్రదర్శన లిస్తూ , కర్నూలు జిల్లాలోనే కాక రాయలసీమలోనే ఆంజనేయ పాత్రలో నటనకు జీవం పోసి ప్రశంసలు పొందారు. ఆకులేటి, లక్ష్మణరావు వంటి ప్రసిద్ధ నటుల తర్వాత అంతటి గాన మాధుర్యం గల ఆంజనేయ పాత్రధారి అక్బర్‌బాష కర్నూలు జిల్లా వాసి కావడం రంగస్థలం కళాకారులకు గర్వకారణం. ఆయన లేని లోటు తీర్చలేనిదని మూడేళ్ల అనారోగ్య రీత్యా నాటక ప్రదర్శనలు లేక చాలీచాలని జీవితం జీవించిన అక్బర్ బాషకు కు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రముఖ రంగస్థలం కళాకారులచే సహబాష్ అనిపించుకున్నారని కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుర్రపు శాల అంకయ్య ప్రధాన కార్యదర్శి పెరికలపాటి హనుమంతరావు చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీయుల్లా, కళావాహిని సాహితీ సంస్థ అధ్యక్షులు ఎం మనోహర్ బాబు, శ్రీశైల భ్రమరాంబ కళా సమితి అధ్యక్షులు డి.పుల్లయ్య, రైతు కళానిలయం అధ్యక్షులు డిఎన్‌వి సుబ్బయ్య, కర్నూలు కళాకారుల సంఘం అధ్యక్షులు వివి రమణారెడ్డి విశ్వకళా సమితి అధ్యక్షులు బీసన్న, కర్నూలు కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు సయ్యద్ రోషనలి, సి బి అజయ్ కుమార్, జిల్లా కళాకారులు, కళాప్రియ తిరుపాలు, వెంకటేశ్వర్లు, రమణాచారి, రాజశేఖర్, శ్రీనివాసరావు, ఆనందరావు, డి.పార్వతయ్య, ఆంజనేయులు, వలి, అరుణ కుమారి, నారాయణ, ప్రభాకర్ తదితరులు అక్బర్ బాష కు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



అక్బర్‌బాష భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పెరికలపాటి హనుమంతరావు చౌదరి, తదితరులు

ప్రజాసంఘాలకు సహకరిస్తాం

- తహశీల్దార్, ఎస్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాసంఘాలకు తమ వంతు సహకరిస్తామని తహశీల్దార్ ఎ.రవి, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌ను, ఎస్ఐని కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో ఏ సమస్య ఉన్నా తమ పరిధిలో సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి జి.అంజి, మండల నాయకులు జి.సురేష్, జి.మారెప్ప పాల్గొన్నారు.

'హమాలీ'లకు సమగ్ర చట్టం చేయాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమనిధి ఏర్పాటు చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ధనంజయ మీటింగ్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హమాలీ కార్మికులు రోజుకు 12 నుండి 16 గంటలు మూటలు మోస్తూ, రోజు పని దొరకక చాలీచాలని కూలిలతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పని ప్రదేశంలో సరైన వసతులు, ప్రమాదాలు జరిగినా, మరణించినా ప్రభుత్వం, యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. హమాలీ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులు పౌష్టికాహార లోపంతో నడుము, మోకాలు, భుజాలు, మెడభాగాల్లో ఎముకలు అరిగిపోయి పని చేయలేక ఇంటి దగ్గరే ఉంటూ కుటుంబానికి భారంగా మారుతున్నారని తెలిపారు. 50ఏళ్లు నిండి అనారోగ్యం బారిన పడిన కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదానికి గురై వికలాంగుడిగా మారిన కార్మికుడికి రూ.5 లక్షలు, ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. హమాలీ కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పీఎఫ్ ఇఎస్ఐ, ప్రమాద బీమా ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో హమాలీ నాయకులు రఫీ, హుషన్ బాష, మాబాష, నరసింహారెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

వేంపెంటలో 18 మందికి అతిసార

- ఒకరు మతి, గ్రామంలో భయాందోళన
- గ్రామాన్ని సందర్శించిన డిపిఒ, ఆర్డీవో



వైద్య శిబిరంలో రోగులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పాములపాడు

వేంపెంట గ్రామంలో అతిసారాతో బోయ లక్ష్మీదేవి(70) శుక్రవారం మృతి చెందింది. లక్ష్మీదేవికి గురువారం వాంతులు విరోచనాలు అవడంతో గ్రామంలో వైద్య చికిత్స అందించారు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మెరుగైన వైద్యం కోసం 108లో ఆత్మకూరుకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. గ్రామంలో అతిసారా కేసులు 18కి చేరాయి. ఆర్డీఓ దాస్, డిపిఓ మంజులవాణి, జిల్లా వైద్య అధికారి వెంకటరమణలు శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో శానిటేషన్, రక్షిత మంచినీటిపై చర్యలు చేపట్టారు. ప్రజలకు పలు సూచనలు చేశారు. నీటిని వేడి చేసుకుని తాగాలని, వేడివేడిగా ఆహారాన్ని తీసుకోవాలని, వ్యక్తి గత శుభ్రత పాటించాలని సూచించారు. గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చేంతవరకు మెడికల్ క్యాంపు కొనసాగుతుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు ధైర్యం చెప్పారు. జిల్లా సహాయక వైద్య అధికారి కాంతారావు నాయక్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపిడిఓ గోపికృష్ణ, ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డిలు గ్రామాన్ని సందర్శించి చర్యలు చేపట్టారు. గ్రామంలో అతిసారకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. తాగునీటిని టెస్టింగ్ నిమిత్తం కర్నూల్ ల్యాబ్‌కు పంపించారు. రిపోర్ట్స్ ఇంకా రాలేదని వైద్యాధికారి నాగలక్ష్మి దేవి తెలిపారు.



అతిసారతో మృతి చెందిన లక్ష్మీదేవి(ఫైల్)

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : యుటిఎఫ్



డోన్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - డోన్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సుబ్బారాయుడు, నరసింహారెడ్డి, ఎన్‌జిఓ డోన్ తాలూకా కార్యదర్శి ప్రేమ కుమార్ డిమాండ్ చేశారు. యుపియస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డోన్ డివిజన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడని యుపియస్ విధానాన్ని తీసుకొని రావడాన్ని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ హరీష్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ కర్నూల్ జిల్లా కార్యదర్శి లక్ష్మి దేవి, సంజీవరాయుడు, బాల రంగారెడ్డి, సుంకన్న, కలాం, ప్యాపిలి మండల అధ్యక్షులు కృష్ణ నాయక్, సర్వజ్ఞ మూర్తి, అబ్దుల్ లతీఫ్, సిఐటియు నాయకులు శివ రామ్, రామాంజనేయులు, నాగ మద్దయ్య, శ్రీకాంత్, చంద్ర మోహన్, అంజనప్ప, లక్ష్మి నాయక్, ప్రసాద్, రమేష్ నాయుడు, శాంతి కుమార్, విశ్వనాథ్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాజ కుళ్లాయప్ప, రామ కృష్ణ, మనోహర్, సుమన్ జయరాముడు, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, షంషాద్ బేగం, భార్గవి పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల యూ నిఫైడ్ పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం జిపి ఎస్ పథకాన్ని అమలు చేస్తా ఉందని పై రెండు గాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ అన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాలలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ బిక్ష కాదని సుప్రీంకోర్టు గతంలో చెప్పిందని, 33 సంవత్సరాల సర్వీసు ఉద్యోగి చేసినందుకు వద్ధాప్యంలో భరోసాగా ఉంటుందని పెన్షన్ పథకాన్ని ఆంగ్లేయులు ప్రవేశ పెట్టారని అన్నారు. ఇటీవల వర్క్ అడ్జస్ట్మెంట్ అశాస్త్రీయంగా, అసంబద్ధంగా విద్యాశాఖ అధికారులు నిర్వహించారని,117 జి.ఓ. ప్రకారం కాకుండా 53 జీవో ప్రకారంగా సర్దుబాటు ప్రక్రియ నిర్వహిం చాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యా యులను సర్దుబాటు చేసి, ప్రాథమిక పాఠశాలలను నిర్వీ ర్యం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సాయి ప్రసాద్, జాకీర్ హుస్సేన్, బొజ్జయ్య, శ్రీనివాసులు, రఘు స్వామి, సోమశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10 గేట్ల ద్వారా యథావిధిగా నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం జలాశయం నుండి పది గేట్ల ద్వారా యథావిధిగా నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ జూరాల నుండి వరద నీటి ప్రవాహం శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు 3,29,203 క్యూసెక్కులు ఉండడంతో ఆనకట్ట నుండి 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు 2,79,370 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 884.7.0 అడుగులకు చేరగా నీటి నిల్వ సామర్థ్యం 213.88 టిఎంసిలుగా ఉంది. అదే సమయానికి రెండు విద్యుత్ కేంద్రాల నుండి గడచిన 24 గంటల్లో 32.242 మిలియన్ యూనిట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌కు 30,000క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలా స్రవంతికి 1505క్యూసెక్కులు, మహత్మ గాంధీ కల్వకుర్తి లెఫ్ట్ ఇరిగేషన్కు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు విద్యుత్ కేంద్రాల నుండి 68,654 క్యూసెక్కులు, 10 గేట్ల ద్వారా 2,79,370క్యూసెక్కులతో కలిపి 3,48,024క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

గూగుల్ ఆర్గనైజర్‌గా ఆర్జీఎం విద్యార్థిని

ప్రజాశక్తి - పాణ్యం

గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ ఆర్గనైజర్‌గా ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డేటా సైన్స్ విద్యార్థిని సాయి లక్ష్మి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గూగుల్ డెవలపర్ ఆన్ క్యాంపస్‌లో భాగంగా ఆర్జిఎం సీఈటి కళాశాలను ఎంపిక చేశారని అన్నారు. ఇందులో భాగంగా గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన ఈ క్లబ్ ద్వారా విద్యార్థులు కోడింగ్ నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఎం శాంతిరాముడు, ఎండి శివరాం, డీన్ డాక్టర్ అశోక్ కుమార్, హెచ్‌ఓడి భాస్కరరావు, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.



ఆర్జీఎం విద్యార్థిని సాయి లక్ష్మి

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు తగ్గుముఖం

- వైద్యాధికారుల సేవలు మరువలేనిది



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని కపిలేశ్వరం పాత మాడుగుల గ్రామాల్లో సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని, వైద్యాధికారుల బృందం చేసిన సేవలు మరువలేనివని వైద్యాధికారి జబీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి నల్లమల్ల అడవులకు సమీపంలో ఉన్న గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలడం జరిగింది అన్నారు. అయితే ఎర్రమఠం వైద్యాధికారులు తమ వైద్య సిబ్బందితో కలిసి ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. రోజురోజుకు సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. అలాగే కపిలేశ్వరం గ్రామంలో వైద్యాధికారి జబ్బీర్ హెల్త్ అసిస్టెంట్లు సత్యం రెడ్డి, శాంతమ్మ, ఆశ వర్కర్లు ప్రతి రోజూ గ్రామానికి వెళ్లి గ్రామంలో ఇల్లు తిరిగి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. అలాగే దోమల మందులను వారే స్వయంగా స్ప్రే చేయడంతోపాటు, రాత్రి సమయంలో దోమల మందు ఫాగింగ్ చేయడం సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ప్రజల వద్దకు వెళ్లి మందులు దగ్గర ఉండి వేస్తూ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషించినట్లు అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయుడు తెలిపారు. ఇలాంటి వైద్య సిబ్బంది రాత్రనక పగలనక వైద్య సేవలు అందించినందుకే సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టడం జరిగిందని పలువురు బహిరంగంగా చర్చించుకోవడం విశేషం. ఏది ఏమైనాప్పటికీ ఎర్రమఠం వైద్యాధికారులను వైద్య సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు : ఏడి



సేంద్రీయ ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వెలుగోడు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని, ప్రతి రైతు రసాయన ఎరువుల కంటే సేంద్రీయ ఎరువులు ఉపయోగించి అధిక దిగుబడులు పొందాలని ఆత్మకూరు ఏడి ఆంజనేయ తెలిపారు. గుంతకందాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సమక్షంలో ఏడి ఆంజనేయ అధ్యక్షతన శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాడితే పంట ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు పోషక పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. పంట మొదటి దశలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగుల నివారణకు వేపనూనె లీటర్ నీటిలో రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని రైతులను సూచించారు. వరి పొలాల గట్లపైన కందిమొక్కలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాశాఖ అధికారులతో పాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది అప్సర, అలీ, రామకృష్ణ, వెంకట శివ, స్వర్ణ రూప, రైతులు మధుసూదన్ రెడ్డి, సుదర్శన, సుందరం, మల్లికార్జున పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్

ప్రజాశక్తి - గడివేముల

జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గడివేముల స్పెషల్ ఆఫీసర్ డిడి మైన్స్ అధికారి రామచంద్ర, తహసీల్దార్ బివిఎన్ విద్యాసాగర్, ఎంపిడిఓ శ్రీనివాసులుతో కలిసి మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల, బీసీ బాలుర వసతి గృహాన్నిశుక్రవారం పరిశీలించారు. మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో వాటర్ ట్యాంక్ క్లీనింగ్, డ్రైనేజీ, ల్యాండ్ లెవలింగ్ పనులపై సంబంధిత ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చారు. పాఠశాలల వద్ద కాంపౌండ్ వాల్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు తగిన మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బాత్రూం మరమ్మతులు పనులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథం విఆర్‌ఓలు సామన్న, ప్రసాద్ నాయుడు, ఖాజా హుస్సేన్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గొర్రెల సంఘం కమిటీ ఎన్నిక

మండలంలోని గడిగేరేవుల గ్రామంలో శ్రీవాసుదేవ గొర్రెల సంఘం కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం గౌర అధ్యక్షునిగా నగిరి సంజీవ రాయుడు, అధ్యక్షుడుగా చింతల వెంకటరమణ, ఉపాధ్యక్షుడుగా మిద్దె శ్రీనివాసులు, సెక్రెటరీగా గోద ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా చింతల నారాయణ, జీడి శ్రీనివాసులు వి.రమేష్, చింతలన్న గారి వెంకటరమణ, సభ్యులుగా జి.శ్రీనివాసులు. చింతల కృష్ణుడు, చింతల వెంకటేశ్వర్లు, నగిరి శేషు, సంగెం సుధాకర్, గోధ నాగేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ పావని, ఎన్నికల అధికారి బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు

మెడికల్ కళాశాలలో సౌకర్యాలు మెరుగుపరుస్తాం

- మెడికల్ కళాశాలను సందర్శించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్



మొక్కలు నాటుతున్న మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో నూతనంగా నిర్మితమైన మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోర్స్‌కు అవసరమయ్యే అన్ని పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం మెడికల్ కళాశాల ఆవరణలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమ అనంతరం నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి మంత్రి పరిశీలించారు. రాష్ట్రన్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నూతనంగా నిర్మితమై ఉన్న మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించే ఎంబిబిఎస్ విద్యార్థులకు అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్‌లకు అవసరమయ్యే అన్ని పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆర్ఓ ప్లాంట్, ఫర్నిచర్, ల్యాబ్ పరికరాలు, లెక్చరర్ గ్యాలరీ, హాస్టల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని కళాశాల వైస్‌ప్రిన్సిపల్ ఆనంద్‌కుమార్‌ను మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను, కళాశాల అధ్యాపకులను ఆదేశించారు. అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్‌లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. మెడికల్ కళాశాలకు రెండు కొత్త బస్సులు వచ్చాయని డ్రైవర్లు లేని కారణంగా నిరుపయోగంగా ఉన్నాయని కళాశాల వైస్‌ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎపి ఎంఎస్ ఐడిసి ఇంజినీర్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో మంత్రి కలెక్టర్‌కు నివేదించారు.

కాణిపాకం వినాయకుని దర్శించుకున్న మంత్రి బీసీ



ప్రజాశక్తి - బనగానపల్లె

కాణిపాకం వినాయకుడిని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శుక్రవారం శ్రీ కాణిపాక వినాయక స్వామి దర్శనానికి వెళ్లిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఆలయ అధికారులు పూర్ణకుంభాభిషేకంతో స్వాగతం పలికారు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరా రెడ్డి, కుమారుడు బిసి మనోహర్ రెడ్డి ,కోడలు క్షీరారెడ్డి, కూతురు మనోరమ, అల్లుడు రమణారెడ్డిలు స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయం మర్యాదలతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు.

'వనం మనం'లో విజయానికేతన్ ప్రతిభ



మంత్రి, కలెక్టర్‌తో విజయానికేతన్ విద్యార్థినులు

ప్రజాశక్తి - పాణ్యం : నంద్యాల జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవంలో పాణ్యం మండలానికి చెందిన విజయా నికేతన్ విద్యార్థినిలు నృత్యం, కోలాటం లాంటి కార్యక్రమాల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి చెప్పారు. తమ పాఠశాలలో చదువుతో పాటు యాక్టివిటీస్ నేర్పించడంతో పిల్లల్లో సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను పాఠశాల ఇన్‌ఛార్జీ మురారి వేణు గోపాల్, కో-ఆర్డినేటర్ బ్రహ్మం అభినందించారు.

అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

- 42 అంశాలకు ఏకగ్రీవ తీర్మానం
- ఛైర్మన్ సప్తశైల రాజేష్ వెల్లడి



ప్రజాశక్తి - డోన్

డోన్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని ఛైర్మన్ సప్తశైల రాజేష్ వెల్లడించారు. శుశ్రకవారం ఛైర్మన్ సప్తశైల రాజేస్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 42 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపలింది. డోన్‌లోని ప్రధాన, పెద్దమురుగునీటి కాలువ రూరల్ స్టేషన్ నుంచి నూతనంగా నిర్మించిన స్‌స్టేషన్ ఆఫీసువరకు పూడికతో, కంపచెట్లతో నిండి ఉన్నందున మురుగు కాలువను, శుభ్రంచేసి, ముళ్లకంపను తొలగించాని సమావేశం తీర్మానించింది. అన్నక్యాంటిన్ ఏర్పాటుకు రూ.5 లక్షలు కేటాయించి కేటాయిస్తూ తీర్మానించారు. టెండర్లకు కూడా అంగీకరించింది. శ్రీనివాస నగర్‌లో మురుగు కాలువలు, డ్రెయిన్‌ల నిర్మాణానికి రూ.90 వేలు మంజూరు చేశారు. రోడ్లు, డ్రెయినేజీలు, సచివాలయ భవనాల అద్దెలు తదితర అంశాలపై 42 అంశాలను డోన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరామ్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్‌లు కొట్రికే హరికిషన్, ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు డిఇ రసూల్, ఎఇ సురేష్, శానిటేషన్, రెవెన్యూ, హౌసింగ్, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలునాటి పర్యావరణం కాపాడుకుందాం

రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు



ప్రజాశక్తి - రుద్రవరం

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతను కాపాడుకుందామని రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా ఐఎఫ్ఎస్ ప్రాజెక్ట్ టైగర్ నంద్యాల వారి ఆదేశాల మేరకు, రుద్రవరం అటవీ క్షేత్రాధికారి వారి ఆధ్వర్యంలో నరసాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 76వ వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రుద్రవరం అటవీక్షేత్రాధికారి శ్రీపతి నాయుడు మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా 76వ వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 19 శాతం అటవీ విస్తీర్ణం ఉన్నందున అటవీ విస్తీర్ణాన్ని 33శాతం పెంచాలనే ఉద్దేశంతో ఖాళీగా ఉన్న ప్రతి ప్రదేశంలోకూడా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి 33శాతం, అటవీస్తీర్ణాన్ని చేరుకోవాలని ప్రజలందరూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యి మొక్కలు నాటి పరిరక్షించడం ఈ యొక్క వన మహోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పాల్గొన్న సెయింట్ మార్తోమా స్కూల్ విద్యార్థుల చేత , అధికారుల చేత మొక్కలు నాటించారు. తర్వాత ర్యాలీ నిర్వహించి నర్సాపురం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జి శాంతకుమారి గ్రామ పెద్దలు పెద్ద పకీరయ్య, నంద్యాల రామచంద్ర రెడ్డి ఎంపిటిసి సభ్యులు, నర్సాపురం గ్రామ ప్రజలు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మనోరంజన్ ప్రతాప్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ బాబు వారి సిబ్బంది, సెయింట్ మాతో మా స్కూల్ ప్రిన్సిపల్ డేవిడ్ జాన్ వర్గీస్ వారి సిబ్బంది , పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, నర్సాపురం ఆర్ఒ ఓబయ్య పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్ ,డిప్యూటీ రేంజ్ ఆఫీసర్,ముత్తు జావలి, సెక్షన్ ఆఫీసర్, శ్రీనివాసుల రెడ్డి ,ఎఫ్ఎస్ఒ, శ్రీ ఎస్ మొత్తం బాష, ఎఫ్ఎస్ఒ, ఆర్ఇ రాణమ్మ , ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు వై.నాగేంద్రయ్య , టి.రామకృష్ణ , రుద్రవరం రేంజ్ అటవీ సిబ్బంది ,ఫాల్కన్ బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు, స్వచ్ఛ సేవకులు, నర్సాపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాటు సారా విక్రేతల అరెస్ట్


ప్రజాశక్తి - సంజామల

అక్రమంగా నాటుసార విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. కోటపాడుకు చెందిన దస్తగిరి, బోయ వెంకటనారాయణ పేరుసోముల సమీపంలోని గాలేరు నగరి కాలువ వద్ద నాటు సార విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 5.50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - బేతంచెర్ల : వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించి, అందుకు ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎల్.రమేష్ బాబు, టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం తలపెట్టిన "వనం-మనం"లో భాగంగా బేతంచెర్ల కొలుములపల్లి రహదారికి ఇరువైపులా వైస్ ఛైర్మన్ నాగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కమిషనర్ రమేష్ బాబు, ఉన్నం ఎల్ల నాగయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం వనం మనం అనే గొప్ప కార్యక్రమాన్ని తలపెట్టడం చాలా సంతోషంగా ఉందని వారన్నారు. సమాజంలో మానవ జీవితానికి చెట్ల ద్వారా మనిషిని బతికించే ఆక్సిజన్ లభిస్తున్న విషయాన్ని మనిషి గమనిస్తూ కూడా చెట్లను పెంచలేకపోవడం చాలా దురదృష్టకరమని వారన్నారు. మనం జీవితంలో చెట్టు ఒక భాగమైతే సమాజం పచ్చగా ఉండి మనుషులంతా ఆరోగ్యంగా జీవించడానికి చెట్లు తోడ్పాటు అవుతాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలూరు రాఘవరెడ్డి, ఆరో వార్డు కౌన్సిలర్ ఆదిలక్ష్మి, ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్ మధు, సుజాత, నగర పంచాయతీ సిబ్బంది రమణ, ప్రేమ్ కుమార్, డ్రైవర్ వేణుగోపాల్, రామాంజనేయులు, నాగమణి, నాగన్న, వెంకటేశ్వర్లు, కిరణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల నగర పంచాయతీ లోని ఆయా కాలనీలు, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను తప్పకుండా పరిష్కరించడానికి కృషి చేస్తామని బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వైస్ ఛైర్మన్ నాగ వెంకటేశ్వర్లు అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో వైస్ ఛైర్మన్ నాగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం నాడు నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్ శేఖర్ నగర పంచాయతీ అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారం కోసం చేపట్టదలచిన అజెండాను ప్రవేశ పెట్టారు. అజెండాలపై కౌన్సిలర్ రామాంజనేయులు మాట్లాడుతూ సంజీవ్ నగర్ కాలనీలో మహిళల మరుగుదొడ్లు శుభ్రపరచేందుకు నీటి సరఫరా చేయడం లేదని దాదాపు వారం రోజులు పైనే మరుగుదొడ్లు మూసి వేయడం వలన మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం ఏంటని అడిగారు. వార్డ్ మెంబర్ ఇబ్రహీం బేతంచెర్ల పట్టణంలోని గత కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన నగర పంచాయతీ ఆధ్వర్యంలో గల స్థలాలపై ఇతరులు ఆక్రమణ చేసుకొని సొంత పనులకు వినియోగించుకోవడానికి నంబర్ రాళ్ల పాతి ఉంచారని, వాటిపై ఎంత వరకు చర్యలు తీసుకున్నారని కమిషనర్‌ను ప్రశ్నించారు. అందుకు స్పందించిన కమిషనర్ పేపర్ ప్రకటన ఇచ్చి బహిరంగంగా ప్రచారం చేయడం జరిగిందని, ప్రభుత్వ స్థలంలో ఎవరైనా అక్రమంగా లేఅవుట్లు వేయడం కానీ వేరైతే పనులు పెట్టుకోవడానికి అనుమతి లేదని, అట్లా చేసిన ఎడల చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు. కౌన్సిలర్ పోలూరు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఎన్జీవోస్ కాలనీ రిజిస్టర్ ఆఫీస్ ప్రాంతాల్లో సిసి రోడ్లు, వీధిలైట్ల సౌకర్యం లేదని చీకటి పడితే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, వీధిలైట్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు. నూతనంగా నిర్మించిన లైబ్రరీ పరిసర ప్రాంతాల్లో సిసి రోడ్లు వేయాలని అన్నారు. మరియు కో ఆప్షన్ వై ఎల్లయ్య మాట్లాడుతూ వేసవికాలంలో బేతంచెర్ల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ట్రాక్టర్లు ఉపయోగించి ట్రాక్టర్ల ద్వారా ట్యాంకులను ప్రజలకు నీటి సరఫరా చేశారని,తొమ్మిది నెలలైనా బిల్లులు రాకపోవడంతో ట్రాక్టర్ యజమానులు లబోదిబోమంటున్నారని అందుకు బిల్లులు ఎందుకు శాంక్షన్ కావట్లేదు ఎవరిలోపమో ఎక్కడ లోపం తెలియజేయాలని పట్టుపట్టారు. కౌన్సిలర్ బుగ్గన శకుంతల మాట్లాడుతూ గౌరీపేటలోని సుంకులమ్మ కట్ట వద్ద డ్రయినేజీ సమస్య అధికంగా ఉందని ఈ సమస్యల పరిష్కారం కొరకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు విజయలక్ష్మి ,బుగ్గన సుశీలమ్మ, ఇబ్రహీం, కోట్ల మధు, రామంజి, డి ఉషెనమ్మ, శకుంతలమ్మ, చింతల నాగిరెడ్డి ,పర్వీన్ యంగమ్మ, కొమ్ము మధు కుమార్, వై ఎల్లయ్య నగర, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బాలకృష్ణ 50 యేళ్ల సినీ ప్రస్థాన వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె : సినీ నటుడు బాలకృష్ణ సినిమాలోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అభిమానులు వేడుకలు నిర్వహించారు. శనివారం పట్టణంలో బాలకృష్ణ అసోసియేషన్ అధ్యక్షులు కొంగని పవన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నందమూరి అభిమానులు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నందమూరి అభిమానుల సంఘం నాయకులుమధు యాదవ్ శ్రీధర్ యాదవ్ చిన్న మద్దిలేటి, శివకుమార్, షొర హస్సేన్ బాష, స్టోర్ కాసిం, సుబ్రహ్మణ్యం నాసిర్ షఫీ సాయికుమార్, మల్లి యాదవ్, విష్ణు పర్వతం, శివా యాదవ్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

శాతనకోటలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - నందికొట్కూర్ టౌన్ : మండలంలోని శాతనకోట గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని మండల తహసీల్దార్ శ్రీనివాసులు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణ కొట్కూరు ఎస్సై తిరుపాలు పౌర హక్కుల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి వివక్షత ఉండకూడదని ప్రజలకు తెలియజేశారు. అలాగే వివిధ రకాల చట్టాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై పొలంబడి

ప్రజాశక్తి - సంజామల : సంజామల మండల పరిధిలోని బొందలదిన్నెయందుశుక్రవారం మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పంట సాగులో పాటించవలసిన మెలకువలను రైతులకు ఎంఏ‌ఓ సుధాకర్ రెడ్డి వివరించారు. జీపిపి పద్ధతులను అనుసరించి తక్కువ పెట్టుబడి అధిక లాభం పొందవచ్చు అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముదిగేడు విఏఏ సురేంద్ర పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్** రైతులు తమ వ్యవసాయంలో పంటలకు తగిన మోతాదులో రసాయన ఎరువులు ఉపయోగించుకోవాలని, అధిక మోతాదులో వాడటంతో దిగుబడి తగ్గి నష్టాలు వచ్చే ప్రమాదం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఏడిఏ రాజశేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి సిబ్బందితో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల స్టాక్ వివరాలు కార్డులో పంపిణీ, ఈ-క్రాప్ బుకింగ్ మట్టి నమూనా పరీక్షలు తదితర అంశాలపై వ్యవసాయ సిబ్బందికి సలహాలిచ్చారు. పొలం గట్ల పైన కంది, కూరగాయలను నాటుకొని క్రిమి కీటకాలను తెగుళ్ల నుండి నివారించవచ్చని సూచించారు సల్ఫర్ సంబంధిత ఎరువులు వాడవద్దని ఆయన కోరారు. **కొత్తపల్లి :** గ్రామాల్లో పని చేస్తున్న వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. మండలంలోని పాలెం చెరువు గ్రామంలో జీపిపి పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే గువ్వలకుంట్ల రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి ఈ పంట నమోదు, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు షేక్ జాహిద్ పాల్గొన్నారు. **పగిడ్యాల :** ఈ-పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో మొక్కజొన్న పంటను ఆయన శుక్రవారం పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఖరీఫ్‌లో పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోద చేసుకోవాలన్నారు. లేని ఎడల ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే పథకాలు రుణాలు మంజూరు కావని తెలిపారు. కౌలు రైతులు కౌలుకు తీసుకున్న పొలంలో ఏ పంట సాగు చేశారో పంట సాగు హక్కు పత్రాన్ని తీసుకోవాలన్నారు. కౌలు సాగు హక్కు పత్రం సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి మంజూరు చేస్తారన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


సంజామల

ప్రజాశక్తి - సంజామల నంద్యాల జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని రోప్ స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె శృతి ప్రతిభ కనపరిచింది. క్రీడాకారిణి శృతి జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి చేతుల మీదగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు వ్యాయామ సంచాలకులు బాషా తెలిపారు. **నంద్యాల**


నంద్యాల కలెక్టరేట్

కలెక్టరేట్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎస్‌డిఆర్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. నంద్యాల ఎస్‌డిఆర్ స్కూల్ విద్యార్థులు క్రికెట్‌లో బాలురు, బాస్కెట్ బాల్‌లో బాలురు, బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారు. అదే విధముగా వాలీబాల్, ఫుట్‌బాల్‌లో బాలురు ద్వితీయ స్థానం సాధించారు. వీరందరూ కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్స్, ట్రోఫీలను అందుకున్నారు. ఎస్‌డిఆర్ వరల్డ్ స్కూల్ చైర్మన్ శనివారపు కొండారెడ్డి విద్యార్థులను, కోచ్‌లు నవీన్, సుజాత, తేజస్విని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ విజయ శేఖర్‌లను అభినందించారు. **పగిడ్యాల :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి అండర్-14 రగ్బీ క్రీడాలో మండలంలోని లక్ష్మాపురం సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి కప్పును కైవసం చేసుకున్నారని వ్యాయామ ఉపాధ్యాయురాలు లావణ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 29న డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు చేతుల మీదగా గురుకుల క్రీడాకారులకు క్రీడా బహుమతులు, కప్పు అందజేసినట్లు తెలిపారు. అలాగే ఆర్చరీ పోటీల్లో గురుకుల విద్యార్థులు మూడు పథకాలు సాధించారు. గోల్డ్ మెడల్, సిల్వర్, కాంస్య పతకాలను సాధించినట్లు ఆమె తెలిపారు. **బండి ఆత్మకూర్ :** నంద్యాల జిల్లా


పగిడ్యాల

ఎస్పీజీ గ్రౌండ్‌లో ఈ నెల 29న తేదీజరిగిన జోనల్ హాకీ క్రీడల్లో సంత జుటూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బాలికలు, బాలురు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్నారు. గెలుపొందిన బాలబాలికలకు సర్పంచు వెలగల రామచంద్రుడు, స్కూల్ మేనేజ్ కమిటీ చైర్మన్ జీవన్ కుమార్, గ్రామ పెద్దలు పెట్రోల్ బంకు కృష్ణారెడ్డి, వెలగల తిరుపాల్ యాదవ్ అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థిని విద్యార్థులు రాణించడం వల్ల మానసిక ఉల్లాసం పెరిగి చదువుల్లోనూ ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలిపారు.


బండి ఆత్మకూర్

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం

సున్నిపెంటలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ.. తహసీల్దార్ శ్రీనివాసులుకు ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వై. ఆశీర్వాదం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వలన పారిశుధ్య లోపంతో కృష్ణా నది నీటిని శుభ్రం చేయకుండా ప్రజలకు నేరుగా సరఫరా చేయడంతో విష జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, కామెర్లతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. శ్రీశైలం మండలం సున్నిపెంట, లింగాలగట్టు, చెంచుగూడాలలో మురికి కాల్వలు, ఎగువ నుండి కృష్ణా నదికి కొత్తగా వస్తున్న వర్షపు నీటిని సరిగా ఫిల్టర్ చేయకుండా సరఫరా చేయడంతో అనారోగ్య సమస్యలు అధికం అవుతున్నాయని వివరించారు. విష జ్వరాలతో ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్తే సరైన ఇంజక్షన్లు, మెడిసిన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా చెంచు గూడాలలో గూడెం చుట్టూ చెట్లు, మురికి కాల్వలు ఉండడంతో చెంచులకు విష జ్వరాలు భారీగా వ్యాపిస్తున్నాయని అన్నారు. అన్ని ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల కొరత లేకుండా చూడాలని కోరారు. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ, ఐటిడిఏపిఓతోపాటు ఉన్నత అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు


బండి ఆత్మకూర్‌లో..

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతను స్వీకరించాలని ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం లోపించడం వల్లనే అధిక వర్షాలు పడుతున్నాయని ఈ వర్షాలు క్రమం తప్పి పడడం వల్ల రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** సున్నిపెంటకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రకాశం జిల్లా పరిధిలో నెక్కంటి రేంజ్ చిన్నారుట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. అటవీశాఖ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేసిన ఫారెస్ట్ రేంజ్ అధికారి పి. ఎండి ఆరిఫ్ ఖాన్, డిప్యూటీ రేంజ్ అధికారి డి. శివశంకర్, బీట్ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతి ఒక్కరు ఇంటికి ఒక చెట్టు ఉండేలా చూసుకోవాలని బండి ఆత్మకూరు రేంజ్ ఆఫీసర్ సిర్జా తెలిపారు. వనమహోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, కళాశాల సిబ్బంది, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్ర నాయక్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తేజలతో కలిసి మొక్కలు నాటారు. వాతావరణ సమతుల్యానికి మానవాళి మనుగడకు అడవులు ఎంతో ఉపయోగపడతాయని, వాటితోపాటు మన చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించి పెంచాలని ఆయన కోరారు. విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మొక్కలు నాటించే బాధ్యత తీసుకోవాలని తల్లిదండ్రులతో పాటు మీరు కూడా ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాతావరణ సమతుల్యాన్ని కాలుష్యాన్ని నివారించాలని కోరారు. కార్యక్రమంలో బండి ఆత్మకూరు సర్పంచ ఎరుకల సంధ్య, జెసి పాలెం ఉపసర్పంచ, టిడిపి సీనియర్ నాయకులు కంచర్ల చిన్న లింగారెడ్డి, ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **వెలుగోడు :** అటవీ శాఖ ఆధ్వర్యంలో వనం - మనం కార్యక్రమాన్ని కస్తూరిబా పాఠశాల ఆవరణలో ఎఫ్.ఆర్.ఓ.(ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్) ఎం.ఏ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనిజతో పాటు ఉపాధ్యాయురాలు నిత్య, సుహాసిని, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు షాలు బాషా, పట్టణ అధ్యక్షులు రాజేష్ యాదవ్, మస్తాన్ వలి, వీర మహిళ సుకన్య, నాగ గోపాల్, ఆర్. అశోక్, శ్రీకాంత్, పవన్, భాస్కర్, తిరుపల్ నాయక్ బి.జె.పి నాయకులు నాగేశ్వరరావు, ప్రతాప్ ఆచారి, బ్రహ్మం, మధు పాల్గొన్నారు.


వెలుగోడులో...

ఘనంగా మౌలాలి స్వామి పీర్ల ఊరేగింపు



ప్రజాశక్తి - కొత్తపల్లి : మండల కేంద్రమైన కొత్తపల్లిలో మౌలాలి స్వామి పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. మౌలాలి స్వామికి దట్టితో గ్రామ పూర్వపు అర్చకులు ఉమామహేశ్వర శర్మ స్వామికి సమర్పించారు. వారం రోజుల నుంచి పీర్ల చావిడిలో కొలువుదీరిన మౌలాలి స్వామి పీర్లు గ్రామ ప్రజల నుంచి పూజలు అందుకోవడం జరిగింది. శుక్రవారం సాయంత్రం గ్రామంలోని ప్రజలు కులమతాలకు అతీతంగా మౌలాలి స్వామి ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామంలో ఊరేగింపులో మౌలాలి స్వామి పీరు కన్నుల పండుగ గ్రామ ప్రజలు, పెద్దలు, పిల్లలు, మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

వికలాంగులకు ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి - మహానంది : వికలాంగుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ చేయూత నిస్తుందని, వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని కర్నూలు, నంద్యాల జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. ఫాతిమా పేర్కొన్నారు. గోపవరం గ్రామ సమీపంలోని సెయింట్ యాన్స్ మానసిక వికలాంగుల శిక్షణ కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులతో నేషనల్ ట్రస్ట్ యాక్ట్ 1996పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మెదడు వాపు, పక్షవాతం, బుద్ధి మాంద్యత, బహుళ వైకల్యం గల వారికి నేషనల్ ట్రస్ట్ కింద, లీగల్ గార్డియన్ షిప్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిన అవశ్యకతపై అవగాహన కల్పించారు. పై వ్యాధి గ్రస్తుల సంరక్షకులు చట్టబద్ధంగా, ధ్రువపత్రం పొందడంతో ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి లోన్లు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ సల్మాన్ రాజు, డోంట్ రూరల్ డెవలప్మెంట్ కో-ఆర్డినేటర్ శివ శంకర్, సెయింట్ యాన్స్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రీనా జోస్, స్పెషల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాన్సీస్ కళ్యాణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆత్మకూరు : ఆత్మకూర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మోహన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని స్థానిక ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు సకాలంలో హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులు తమ శాఖ పరిధిలోని నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

కళ్ళు లేని జీవితం అంధకారమే

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మానవుని శరీరంలో కళ్ళు ప్రధాన పాత్ర పోషిస్తాయి. కళ్ళు లేని జీవితం అంధకారమని భరత్ హాస్పిటల్స్ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ కె. స్వాతి అన్నారు. శుక్రవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్స్ సౌజన్యంతో డివైఎఫ్ఐ, మహిళా సంఘం ఐద్వా 23వవార్డుకమిటీల ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ భగత్ సింగ్ గ్రంథాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఐద్వా నగర నాయకురాలు ఆర్. నలిని అధ్యక్షత వహించారు. డాక్టర్ కె. స్వాతి, నాయకులు మాట్లాడుతూ కంటి చూపు మంచిగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకుంటూ,ఆకుకూరలు గుడ్లు, పాలు, పండ్లు వంటివి తింటూ ఉండాలన్నారు. కంటి చూపు తగ్గకుండా చూసుకోవచ్చన్నారు. కంటి సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. పేదలు తినడానికి తిండి లేని వారు పౌష్టికాహారం తినలేక కళ్ళను నిర్లక్ష్యం చేస్తుంటారని అలాంటి వారి కోసం భరత హాస్పిటల్ వారు ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. పౌష్టికాహారం లేక చిన్న పిల్లలు సైతం కంటి చూపును కోల్పోతున్నారని చెప్పారు. ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పరీక్షలు నిర్వహించి, సూచనలు సలహాలు ఇచ్చి, చూపు మందగించి సమస్యలు ఉన్నవారు భరత హాస్పిటల్ కు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకుని వచ్చినట్లయితే ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి అద్దాలను కూడా ఇస్తామని తెలిపారు.150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్‌బాష, మహిళా సంఘం వార్డు కార్యదర్శి కె.నాగజ్యోతి మాజీడివైఎఫ్ఐ నాయకులు కె.వి.జనార్ధన్రావు, ఆర్.నరసింహులు, సుందరయ్య అభిమాని వెంకటేశ్వర్లు, ఆర్పీల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి,సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ప్రత్యేక అధికారిగా హర్షవర్ధన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా ప్రత్యేక అధికారిగా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు అయ్యేలా ప్రత్యేక అధికారి పర్యవేక్షణ చేస్తారు.



నిరసన తెలుపుతున్న వాణిజ్యపన్నుల ఉద్యోగులు

ప్రాంతీయ కార్యాలయాల రద్దు

15 రోజుల సడలింపునకు ఉద్యోగుల సంఘం హర్షం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఆర్ఒ ఆఫీసులలో రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి న్యాయం జరగాలని ఆ దిశగా విచారణ చేయాలని యూనిట్ ఆఫ్ అపాయింట్మెంట్ ను గౌరవించి రీజినల్ ఆఫీస్ వ్యవస్థలను పునః పరిశీలించి లేదా ఆ వ్యవస్థను రద్దు చేయాలని చిన్నస్థాయి ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని వాణిజ్య పన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎడి రఘురామిరెడ్డి కార్యదర్శి ఎస్పి అబ్దుల్ సాహెబ్ అన్నారు. భోజన విరామంలో చేస్తున్న నిరసనలో భాగంగా నాలుగవ రోజు ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజినల్ కార్యాలయాల వల్ల జరుగుతున్న ఇబ్బందులు సమస్యలు గుర్తించి చిరు ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కారం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేదాక తమ పోరాటాన్ని రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం కొనసాగిస్తామని తెలిపారు. అలాగే 15 రోజులు బదిలీలను వాయిదా వేసి ఉద్యోగుల పక్షాన నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ,సంఘం నాయకులు పాల్గొన్నారు.

మసీదు బహిరంగ ప్రదేశం చెత్తమయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 40వార్డు పరిధిలోని సర్వీస్ రోడ్డు వెంకటరమణ కాలనీ కొత్త బ్రిడ్జి దగ్గర మసీదు బహిరంగ ప్రదేశంలో పరిసర ప్రాంతాల్లోని టీబంకులు, హోటళ్ల యజమానులు తమ వద్ద పోగైన టీ కప్పులు వ్యర్థపదార్థాలన్నీ తెచ్చి అక్కడ వేయిస్తున్నారు. వారికి తోడుగా కాలనీలో ఉన్న కాంప్లెక్స్‌లలో నివాసం ఉంటున్న, ఉద్యోగస్తులు సైతం చెత్తను తెచ్చి అక్కడ వేయడంతో అదొక చెత్త డంప్ యార్డ్‌గా మారింది. ఆ చెత్తగాలికి రోడ్లపై పరిసర ప్రాంతాల్లో చేరడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పగలు ప్రతిరోజు ఇంటింటికి చెత్త సేకరించే క్లాప్‌ఆటోలు వస్తున్నప్పటికీ ప్రజలు వారికి చెత్తను ఇవ్వకుండా రాత్రిపూట చదువుకున్న వారు సైతం మోటార్ సైకిళ్లు, కార్లలో వచ్చి పడేసి పోవడం చాలా దారుణం. ఈ ప్రాంతంలో చెత్త వేయకండంటూ 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి బోర్డుపెట్టినప్పటికీ ప్రజల్లో మార్పు రావడం లేదు. తరచూ మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది అధికారులకు విషయం తెలియజేసి శుభ్రం చేయించడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రజల్లో అవగాహన కలిగించి చెత్త వేయకుండా ఉండేంతవరకు ఏ ఉన్నతాధికారి కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. అధికారులకు చెప్పిన ఏమాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతా బదిలీల వ్యవహారాల్లో తల మునకలై కనీసం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కూడా రావడం లేదు. ప్రస్తుతం ఉన్న కమిషనర్ కూడా ఎస్ఇకి ఇన్చార్జి ఇచ్చి రెండు రోజులు సెలవుపై వెళ్ళారు. దీంతో కర్నూలు కార్పొరేషన్ యజమాని లేని ఇల్లులా తయారైంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న కమిషనర్ పోస్ట్‌తో సహా ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేసి పాలన సజావుగా జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఉంది. అలా కాని పక్షంలో నగరం ఎటు చూసినా చెత్త కనిపిస్తుంది. వర్షం పడితే కుళ్ళి కాలువల లోని మరుగునీరు రోడ్లపై ప్రవహిస్తాయి. దోమలు పెరిగిపోయి ప్రజలు విషజ్వరాలకు, రోగాల బారిన పడే అవకాశం ఉంది. కొపాంతాల్లో మురుగు కాలువలలో కొళాయి



ఇక్కడ చెత్తవేయద్దని బోర్డు పెట్టినా ఇక్కడే వస్తున్న కాలనీ వాసులు

పైపులు సైతం ఉండడంతో అవి రంద్రాలు పడి మురుగనీరు తాగునీటిలో చేరితే ఆ నీరు తాగి ప్రజలు అతిసార బారిన పడే అవకాశం ఉంది. వెంటనే కాలువలో ఉన్న నీటి పైపులను అన్ని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేయని పక్షంలో ఏదో ఒక రోజు ప్రజలు అతిసారతో ఆసుపత్రులలో చేరే అవకాశం ఉంది. పాలక మండలిలో ఉన్నటువంటి నగరపాలక సంస్థ లోని కార్పొరేటర్ లందరూ తమ తమ వార్డులలో ప్రత్యేక శ్రద్ధ వహించి అధికారులకు చెప్పి, పారిశుధ్య కార్మికులతో పని చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ పని చేసినా నాకేంటి అనేది కాకుండా కార్పొరేటర్లు సొంత లాభము కొంత మానుకొని పొరుగువారికి తోడుపడవోయ్ అన్న గురజాడ సూక్తిని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ఆయా అవార్డులలోని ప్రజలు కార్పొరేటర్లను గుర్తుంచుకుంటారు. లేకుంటే ఛీకొడతారు అని గుర్తుంచుకోవాలి. నగరంలోని ప్రజల్లో మార్పు తీసుకురావడానికి చెత్త ఎక్కడంటే అక్కడ పడవేయకుండా అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రకృతిని కాపాడుకోవాలి : గౌరుచరిత

రాయలసీమ వర్సిటీలో వనమహోత్సవం

ప్రజాశక్తి -కర్నూల్ కలెక్టరేట్

ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సూచించారు. అందుకే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పేర్కొన్నారు శుక్రవారం రాయలసీమ వర్సిటీలో వనమహోత్సవం - 2024కు సంబంధించి -అటవీ శాఖ ఆధ్వర్యంలో "అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డితో పాటు , జిల్లా అటవీ శాఖ అధికారి పి.శ్యామల, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గౌరు చరిత మాట్లాడుతూ అమ్మ పేరుతో మొక్కను నాటడం వల్ల వారు ఆ మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకుంటారన్నారు. అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన మీద ఎంతగానో ఉందన్నారు. ఒక్క శాతం వృక్ష సంపద పెరగాలంటే సుమారుగా 25లక్షల మొక్కలు నాటవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇంటి దగ్గర చెట్లను నాటి ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిదీ ఉంటుందన్నారు.అనంతరం "అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి" కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు.అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వై.హరిప్రసాద్ రెడ్డి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పివి.సుందరానంద్, ప్రొఫెసర్ విశ్వనాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, గ్రీన్ కో కోఆర్డినేటర్ రాజశేఖర్, జనసేన పార్టీ నాయకులు అర్షద్, రాంబాబు, చిన్నారులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వనమహోత్సవం పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కెసిఆర్ కళాశాలలో: నగరంలోని స్థానిక కె.వి.ఆర్ బాలికల జూనియర్ , డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్, జి.లాలప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి పరమేశ్వర్ రెడ్డి, డిఎస్‌పి మహబూబ్‌బాష, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివరాం గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కల నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. సీనియర్ అధ్యాపకులు సి. ప్రభు చరణ్ రేష్మ రాధా రమణి ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



కెవిఆర్‌లో మొక్కలు నాటుతున్న పరమేశ్వర్‌రెడ్డి

సోలార్ భూ సర్వేను అడ్డుకున్న రైతులు

వెనుతిరిగి వెళ్లిన సర్వే శాఖ అధికారులు -ఉయ్యాలవాడలో ఉద్రిక్తత

సోలార్ పరిశ్రమ ఏర్పాటు విరమించుకోవాలి

జి.రామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గ్రీన్‌కో యాజమాన్యం ఆధ్వర్యంలో సోలార్ పరిశ్రమమును ఏర్పాటు చేయడాన్ని ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో రైతులు వ్యతిరేకించారు. సోలార్ పరిశ్రమకు భూ సర్వేను చేసేందుకు శుక్రవారం వచ్చిన సర్వే శాఖ ఉన్నతాధికారులను రైతులు అడ్డుకున్నారు. గ్రామంలో సారవంతమైన వ్యవసాయ భూములను సోలార్ పరిశ్రమకు తీసుకుంటే తమ బతుకులు ఏంటని రైతులు సర్వే అధికారులను నిలదీశారు. రైతులు ఆందోళన చేయడంతో వెంటనే సర్వే శాఖ అధికారులు భూములను సర్వే చేయకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకిస్తూ తీర్మానం చేయడం జరిగిందని గ్రామ రైతులు పేర్కొన్నారు. వెంటనే సోలార్ పరిశ్రమ ఏర్పాట్లు కూడా గ్రీన్ కో సంస్థ విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉయ్యాలవాడ రైతులకు ఎపి రైతు సంఘం సంపూర్ణ మద్దతు

ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో సోలార్ పరిశ్రమను ఏర్పాటు చేయాలనే ప్రయత్నాన్ని ప్రజల తిరుగుబాటు చూసిన తర్వాత నైనా విరమించుకోవాలన్నారు. గ్రామంలో విలువైన భూములు ఇప్పటికే డిఆర్‌డిఒ పరిశ్రమకు తీసుకున్నారన్నారు. గ్రామమంతా వ్యవసాయమే జీవనాధారంగా ఉందని మామిడి ,రకరకాల తోటలు పెంచుకుంటూ వేరుశనగ పత్తి మొక్కజొన్న లాంటి పంటలు సాగు చేస్తారన్నారు. గ్రామంలో పశుసంపద కూడా ఎక్కువగా ఉందన్నారు. ఈ సమస్యపై ఇదివరకే గ్రామమంతా గ్రామసభలో మా ఊరికి సోలార్ పరిశ్రమ వద్దు అని ఏకగ్రీవం గా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారన్నారు ఇప్పుడు ప్రభుత్వం మారినా మళ్లీ సోలార్ పరిశ్రమను నిర్మాణం చేస్తామని ప్రయత్నం చేయడం ఆందోళనకర మన్నారు. సోలార్ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోకపోతే ఉయ్యాలవాడ గ్రామ రైతులకు అండగా కలిసి వచ్చే అన్ని ప్రజాసంఘాలను ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు కేంద్రం ఆమోదం శుభ పరిణామం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు కేంద్రం ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయడం శుభ పరిణామమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 ఎన్నికలలో కూటమికి రాష్ట్ర ప్రజలు అధికారం ఇచ్చారని చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ,స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేయాలని అడుగులు ముందుకు వేస్తున్నారని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడం, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో ఓర్వకల్లు ను ఇండస్ట్రియల్ హబ్ గా చేసి ఇక్కడ ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించ నున్నారని తెలిపారు. కర్నూలు కి 20 కిలోమీటర్ల దూరంలోనే ఓర్వకల్లులో వ్యవసాయానికి ఆమోద యోగ్యం కానీ 33 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా గుర్తించారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో సోలార్ పవర్ పార్క్, ఎయిర్‌పోర్టు , జయరాజు ఉక్కు పరిశ్రమ, డిఆర్‌డిఒ, లాంటి పరిశ్రమలు వచ్చాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికంగా మన రాష్ట్రం అభివద్ధి పథంలో నడుస్తుందని ముఖ్యంగా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని అన్నారు. 50 రోజుల్లో కూటమి ప్రభుత్వం నిధులు కూడా కేటాయించడం అంటే కూటమి ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఇక్కడ ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చింత సురేష్, బిజెపి నాయకులు గంగాధర్,నంద్యాల మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి,కల్లూరు మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు సీఎం పర్యటన కొనసాగుతుందిలా...

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం జిల్లా పర్యటనకు రానున్నారు. మధ్యాహ్నం 12-30 విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుండి ఓర్వకల్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12-40 గంటలకు ఎయిర్ పోర్టు నుండి ఓర్వకల్లు మండల కేంద్రానికి 1.05 గంటలకు చేరుకొని ప్రజాప్రతినిధులను ,అధికారులను కలుస్తారు. మధ్యాహ్నం1.20 గంటలకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేస్తారు. అనంతరం గ్రామంలో పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3.15 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి బయలుదేరుతారు. ఓర్వకల్ విమానాశ్రయం నుండి మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు.

సిఎం పర్యటనలో మార్పు

ముందుగా పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో ముఖ్యమంత్రి పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారని అధికారులు నిర్ణయించారు. వాతావరణంలో మార్పులు, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పత్తికొండ మండలం నుంచి ఎయిర్‌పోర్టు సమీపంలోని ఓర్వకల్లు మండల కేంద్రానికి కార్యక్రమాన్ని మార్చారు.



కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులనిరసన

యుపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

కె. సురేష్ కుమార్ రాష్ట్ర సహాధ్యక్షుడు

కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన యునైటెడ్ పెన్షన్స్ స్కీమ్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ. రవికుమార్ అధ్యక్షతన జరిగిన నిరసనలో సురేష్ కుమార్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నూతన పెన్షన్ విధానం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యంగా లేదన్నారు. పెన్షన్ పొందడానికి 20 సంవత్సరాలు సరిపోతుందని అన్నారు. కొత్త విధానంలో మాత్రం 25 ఏళ్ల సర్వీస్‌గా నిర్ణయించడం అన్యాయమన్నారు. దశాబ్దాల పాటు సేవ చేసిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం హక్కు అని పేర్కొన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల తమ వాటా చెల్లించాలని విషయంలో ఎన్‌పిఎస్‌కు యుపిఎస్ కు మధ్య తేడా ఏమీ లేదన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్. జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు ,జిల్లా నాయకులు తిమ్మన్న, అనిల్ ,రాముడు, సురేష్, జయచంద్రుడు,గీతాలక్ష్మీ, మారెప్ప ,హనుమంతు, కాంతారావు, సోమన్న, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.











ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం - నంద్యాల

ఆగస్టు - 2024 | పేజీలు : 12

44 ఏళ్ల ప్రజాశక్తి...

ప్రజాశక్తి - కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

దోపిడీ రహిత సమ సమాజ నిర్మాణానికి 'ప్రతి అక్షరం... ప్రజల పక్షం' అన్న నినాదంతో నడుస్తున్న ప్రజాశక్తి దినపత్రికలోని ప్రతి అక్షరం ప్రజల పక్షంగానే ఉంటోంది. ప్రస్తుతం మన చేతుల్లో ఉన్న ప్రజాశక్తి దినపత్రిక 43 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్నది. ప్రజాశక్తి పత్రిక జాతీయోద్యమ కాలం నుంచే వెలువడుతోంది.జాతీయోద్యమ కాలంలోనే 1942లో కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రికగా మద్రాసులో మొదటిసారి ఆవిర్భవించింది. 1945 నుంచి విజయవాడ కేంద్రంగా ప్రజాశక్తి మొదలయింది. జాతీయోద్యమ నాయకులకు ప్రజాశక్తి పత్రిక కరదీపికగా మారడంతో బ్రిటీషు హయాంలో నిషేధానికి గురైంది. ఈ పత్రిక స్వాతంత్ర్యం వచ్చాక 1948లోనూ నిషేధానికి గురైంది. తెలంగాణ విముక్తి కోసం

వార్త 3లో



ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న పుచ్చలపల్లి సుందరయ్య

వనరులున్నా నిధులు కేటాయించక

వెనుకబడిపోతున్న జిల్లా అభివృద్ధి

టి.రమేష్‌కుమార్ , సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి



జిల్లా సమగ్ర అభివద్ధి చెందాలంటే సాగు ,తాగు నీరు , వ్యవసాయ పంటలు, ఉపాధి కొరకు పరిశ్రమలు ,మౌలిక వసతుల కల్పన ,విద్య, వైద్యం, అట్టడుగు వర్గాల అభివద్ధి, పట్టణాలలో వసతులు కల్పించాలి' అని సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ అన్నారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో అంశాల వారీగా...

జిల్లాలో సాగునీటి వనరులు: ప్రధానంగా కెసి కెనాల్, తెలుగుగంగ ,ఎస్ఆర్‌బిసి, కుందు, కొంత భాగం హంద్రీనీవా, గాలేరు నగరి కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గం లిఫ్టుల ద్వారా సాగునీటిని ఉపయోగించుకుంటున్నారు. ఇంకా చాలా భాగం ఆత్మకూరు పై ప్రాంతాల్లో నీటి వనరులు ఉన్నా సగభాగం మెట్టప్రాంతంగా ఉంటుంది. నందికొట్కూరు నియోజకవర్గంలో మిడుతూరు పూర్తిగా మెట్ట ప్రాంతంగా ఉంటూ నిత్యం కరువు బారిన పడుతున్నది. మిగిలిన మండలాల్లో సగభాగం మెట్ట ప్రాంతంగానే నీటి వనరులు లేవు. వాటికి లిఫ్టుల ద్వారా నీరందించాలి. హంద్రీనీవా నుండి లిఫ్ట్ ద్వారా మిడుతూరు మండలానికి , అలగనూరు ద్వారా నీటిని అందించవచ్చు. రిజర్వాయర్ కట్ట కొంత భాగం కుంగింది. రూ.30 నుంచి రూ.40 కోట్లు గతం ప్రభుత్వం కేటాయించకపోవడం వల్ల నాలుగు సంవత్సరాలుగా నీటిని నిల్వ చేయడం లేదు. ఫలితంగా కెసి కాలువ నీటిని నిల్వ చేసుకోకుండా గడివేముల కింది ప్రాంతాలకు నీరందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రభుత్వమైనా నిధులు కేటాయించి అలగనూరు రిజర్వాయర్‌కు నీటిని నింపాలి. పాణ్యం మండలంలో ఎస్ఆర్‌బిసి ఉన్నా పంట కాలువ లేక సాగునీరందడం లేదు. బేతంచెర్ల సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందిఉంది. తాగునీటికి గోరుకల్లు ద్వారా పైప్ లైన్ వేశారు. ఇంకా సాగునీటికి గూటుపల్లి చెరువును రిజర్వాయర్‌గా చేస్తే హంద్రీనీవా ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్ నింపడం ద్వారా 15 గ్రామాలకు నీటి సౌకర్యాన్ని అదేవిధంగా భూగర్భ జలాలను పెంచవచ్చు. డోన్, ప్యాపిలి మండలాల్లో హంద్రీనీవా కాలువల నిర్మాణం చేయలేదు. చెరువులు నింపకపోవడం వల్ల ఆ ప్రాంతంలో హంద్రీనీవా పోతున్నా సాగునీరు అందించ లేకున్నారు. కాలువలు పూర్తి చేసి చెరువులు నింపాలి. వీటికి గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం వల్ల ఆ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రభుత్వమైనా నిధులు కేటాయించి ఆ ప్రాంత రైతులను ఆదుకోవాలి. తెలుగు గంగ కాలువ పుష్కలంగా నీరు పారుతున్నా చాగలమర్రి మండలంలో పంటకాల్వల నిర్మాణం లేక పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. వర్షాకాలంలో కుందునది నిండుగా ప్రవహిస్తుంటే ఆ నీరు పెన్నాలో కలిసి సముద్రంలో కలుస్తున్నాయి. కుందుపైన జలదరాశి, రాజోలు ప్రాంతాలలో రిజర్వాయర్లు నిర్మించుకుంటే కోయిలకుంట్ల ఉయ్యాలవాడ మండలాలకు నీరు అందించవచ్చు. పనులు ప్రారంభమైనా నిధుల్లేక నిలిచిపోయాయి. జొలదరాశి, రాజోలు రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. నంద్యాల జిల్లా నుండి రాయలసీమకు శ్రీశైలం జలాలు తెలుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, ఎస్ఆర్‌బిసి, కెసి కెనాల్ ద్వారా వెళుతున్నాయి. శ్రీశైలం వరద జలాలను పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి. పోతి రెడ్డిపాడు వద్ద లిఫ్టు పూర్తి చేసి 40 వేల క్యూసెక్కుల నీరు ఎత్తిపోయడం ద్వారా హంద్రీనీవా, కుందు వెడల్పు చేసి నీటిని మళ్లించడం వల్ల రాయలసీమకు నీరందించవచ్చు. ఇంకా పోలవరం పూర్తి చేసి శ్రీశైలం జలాలను రాయలసీమకు ఉపయోగించుకో వచ్చు. దీనికంతటికి ప్రభుత్వ చితశుద్ధితో నిధుల కేటాయింపు సాగునీటి వనరుల పూర్తి చేయ గలిగితే జిల్లా అభివద్ధికి దోహదపడుతుంది.

వ్యవసాయం : జిల్లాలో ప్రధాన పంట వరి. అయితే ధాన్యం గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల పెట్టుబడి వ్యయం అధికం కావడం వల్ల రైతాంగం ప్రత్యామ్నాయ పంటల వైపునకు మల్లుతున్నారు. మొక్కజొన్న, మిరప, పత్తి, పంటలు విస్తారంగా వేస్తున్నారు. వీటితోపాటు శనగ ,కంది, సోయాబీన్స్, జొన్న, సద్ద లాంటి పంటలు వేస్తున్నారు. మిరప, పత్తిలాంటి పంటలకు చీడపీడలు ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడి తగ్గి రైతు పెట్టిన పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు .అధిక వర్షాల వల్ల మొక్కజొన్న, శనగలాంటి పంటలు కూడా నష్టపోతున్నాయి. ప్రభుత్వం వైపు నుండి నష్టపరిహారం సరిగా అందటం లేదు. అరకొరగా పలుకుబడి ఉన్న వారికి కొంత అందుతుంది. ఉద్యానవన పంటలు పెరుగుతున్నాయి. మామిడి, సపోటా, బొప్పాయి ,జామ, అరటి ,మునగ ,నేరేడు ,రేగు లాంటి పంటలు పెరుగుతున్నాయి .ప్రకృతి వైపరిత్యాల వల్ల ముఖ్యంగా గాలి ,వానలకు పంటలు బాగా దెబ్బతింటున్నాయి. వాటికి ప్రభుత్వ పరిహారం అందడం లేదు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రైతులు అప్పుల పాలవుతున్నారు. కాయగూరలు ,ఆకుతోటలు లాంటివి అక్కడక్కడ వేస్తున్నారు.ఎన్ని రకాల పంటలు వేస్తున్నా రైతు అప్పుల ఊబిలోనే ఉంటున్నారు. మధ్యతరగతి ,భూస్వామ్య రైతులు తమ భూములను కౌలుకిచ్చి కౌలు తీసుకుంటూ, ప్రభుత్వ పరిహారాలు తీసుకుంటూ ,బ్యాంకు రుణాలు తీసుకుంటూ వాటితో ఇతర వ్యాపారాలు చేసుకుంటూ బాగుంటున్నారు. కానీ చిన్న సన్నకారు రైతులు కౌలురైతులు తీవ్రంగా అప్పుల పాలై నష్టపోతూ ఆత్మహత్య చేసుకుంటున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు లేకపోవడం, ప్రభుత్వమే పంటను ప్రభుత్వ ధరకు కొనుగోలు చేయకపోవడం, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి మిగులు లేక అప్పుల పాలవుతున్నారు. కౌలు రైతులకు కౌలు పెరగడంతో పాటు ప్రభుత్వ రుణాలు లేక బయట అప్పులు చేయడం, ప్రకృతి వైపరిత్యాల వల్ల వచ్చే నష్టపరిహారం అందక అధిక వడ్డీలకు తెచ్చి అప్పుల పాలవుతు న్నారు. కౌలు రైతుకు యజమానితో సంబం ధం లేకుండా పంటల ఆధారంగా రుణ అర్హత కార్డులు ఇచ్చి ప్రభుత్వ సహాయం అందిం చాలి. పంటలను ప్రభుత్వమే గిట్టుబాటు ధరలకు మార్కెట్ యార్డుల ద్వారా కొనుగోలు చేయాలి. ప్రతి పంటకు మద్దతు ధరలు ప్రకటించి రైతులను ఆదుకోవాలి. సీడ్ పరిశ్రమ ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు రైతుకు అందించడం వ్యవసాయంలో మెళకువలు ప్రతి గ్రామంలో సభలు పెట్టి రైతులకు అవగాహన చేయడం, భూసార పరీక్షలు చేసి సబ్సిడీకి ఎరువులు ,విత్తనాలు, మందులు అందించడం ద్వారా రైతులకు కొంతైనా బాగుపడతారు. పాడి రైతులకు మేలు జాతి పశువులను సబ్సిడీకి అందించడం పాలకు గిట్టుబాటు ధరలు కల్పించి పశుగ్రాసం కొరకు బంజర భూములు కేటాయించాలి. వారి అభివద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలి. గొర్రెలు, మేకలు, కోళ్ల మొదలైనవి కూడా వ్యవసాయానికి ఉపవృత్తులు వారికి కూడా ప్రభుత్వ సహకారం అందించాలి.

పరిశ్రమలు : జిల్లాలో చక్కర కర్మాగారం, స్పిన్నింగ్ మిల్లు, శీతల పానీయాల పరిశ్రమ ,ఆయిల్ , రైస్ మిల్స్ ,పత్తి మిల్లులు మూతపడ్డాయి. గడివేముల, పాణ్యం, బనగానపల్లె ,కొలిమిగుండ్ల ప్రాంతాలలో సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్లాస్టిక్ పరిశ్రమలు అక్కడక్కడ ఉన్నాయి.పాలిష్ రాళ్ల పరిశ్రమలు ఎగుమతులు లేక వందలాదిగా బేతంచెర్ల, డోను, బనగానపల్లె ప్రాంతాల్లో మూతపడ్డాయి. ఉన్న సిమెంట్ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు లేవు. కొత్త పరిశ్రమలు రావడం లేదు. పరిశ్రమల కోసమని భూమిని తీసుకొని పరిశ్రమల స్థాపించక భూములను అమ్ముకొంటున్న పరిశ్రమ యజమానులు రైతులకు తీవ్రంగా నష్టం చేస్తున్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగాలు కోల్పోయిన కార్మిక వర్గం జిల్లాలో ఉపాధి లేక ఇతర జిల్లాలకు ,రాష్ట్రాలకు ,దేశాలకు వలసలు పోతున్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలున్నా ప్రభుత్వ పాలకుల చిత్తశుద్ధి లోపించడం వల్ల పరిశ్రమలు రావడం లేదు. సోలార్ పరిశ్రమలు వేల ఎకరాల్లో విస్తరించిన అందులో ఉద్యోగాలు రావు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు తప్ప. నంద్యాలలో చెరుకు పంట పండించేందుకు ఒక టిఎంసి నీటిని హక్కుగా ఉన్న చక్కర కర్మాగారం మూతపడడంతో చెరుకు రైతులు నష్టపోయారు. పరిశ్రమ లేక కార్మికులు ఉపాధి పోయింది. ఇప్పటికైనా చక్కర కర్మాగారాన్ని నిర్మించి చెరుకు రైతులను కార్మికులను ఆదుకోవాలి. పత్తి పంట విస్తారంగా ఉంటుంది. స్పిన్నింగ్ మిల్లు ,జిన్నింగ్ మిల్లుల ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి దొరుకుతుంది. అటవీ సంపద జిల్లాల విస్తారంగా ఉంది. నాణ్యమైన వెదురు నల్లమల అడవులలో లభిస్తుంది. పేపర్ మిల్లు ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు కల్పించవచ్చు. ఇనుప ఖనిజం దొరుకుతుంది. స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు కల్పించవచ్చు. ఆయిల్ అండ్ రైస్ మిల్స్ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వందలాది మందికి ఉపాధి దొరుకుతుంది. మైనింగు జిల్లాలో విస్తారంగా ఉంది. ఖనిజ ఆధారిత సిమెంట్, సున్నం, ముగ్గు రాళ్లు ,గ్రానైట్ ,పాలిస్ రాయి లాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే జిల్లాలో యువతకు ఉపాధి దొరికి వలసలు నివారించ వచ్చు. ఈ పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి .

మౌలిక వసతులు : గత ప్రభుత్వం రహదారుల మరమ్మతులు చేపట్టలేదు. ప్రధాన రహదారులకు గ్రామీణ రహదారుల అనుసంధానం చేయడం ద్వారా రవాణా పెరుగుతుంది. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేసి పరిశ్రమలకు అందించాలి. తాగునీరు ,డ్రైనేజీ, ప్రతి గ్రామంలో ,పట్టణంలో మెరుగు పరచాలి.వరద నివారణ చర్యలు చేపట్టాలి. రైల్వేస్టేషన్లో ఆధునీకరణ చేయాలి.తదితర మౌలిక వసతులకు నిధులు కేటాయించాలి.

విద్యా: ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి మం డలంలో జూనియర్, డిగ్రీ కళాశాలలు ,జిల్లా లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజ్ మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి. మైనార్టీలకు ఎక్కువగా ఉన్న జిల్లా కావడంతో ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో కళాశాలలో మౌలిక వసతులు కు ప్రాధాన్యత ఇవ్వాలి. పేద విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ ,బీసీ, ఇతర ఆదాయం తక్కువగా ఉన్న విద్యార్థులకు హాస్టల్ వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించాలి.

వైద్యం: జిల్లాలో జిల్లా స్థాయి ఆసుపత్రి ఉంది .అందులో రోగనిర్ధారణ పరికరాలు లేవు. ఉన్నవాటిని ఉపయోగించడం లేదు. వివిధ రకాల జబ్బులకు స్పెషలిస్టు డాక్టర్ల కొరత ఉంది .మెడికల్ కాలేజీ వచ్చింది. ఆసుపత్రికి అనుసంధానం చేసినా మౌలిక వసతులు మంచినీరు ,డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని ఇతర ఉద్యోగులను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా నలుమూలల నుండి వస్తున్న రోగులకు ప్రభుత్వ వైద్యం అందుతుంది. లేనట్లయితే ప్రైవేట్ ఆస్పత్రులలో వేలు ,లక్షల రూపాయల ఖర్చు చేసి కుటుంబంపై భారం పడుతుంది. పిహెచ్‌సి సెంటర్లు ఉన్నా అందుబాటులో డాక్టర్లు, మందులు ఉండడం లేదు. కుటుంబ డాక్టర్ ప్రయోగం కూడా విఫలం అయింది. కావున పిహెచ్ సి సెంటర్లో డాక్టర్లను, మందులను ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. ఆర్ఎంపి డాక్టర్లకు ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించి ప్రభుత్వ ఆసుపత్రులకు అనుసంధానం చేయాలి.

శాంతి భద్రతలు : జిల్లాలో నేరాలు పెరుగుతున్నాయి. రౌడీ మూకలు, మోసగాళ్లు, ఫైనాన్స్ వ్యాపారులు ,సైబర్ నేరగాళ్లు, మట్కా, జూదం, గంజాయి లాంటి అసాంఘిక శక్తులు పెట్రేగిపోతున్నాయి. దొంగతనాలు ,దౌర్జన్యాలు, భూకబ్జాలు, మట్టి, ఇసుక, మైనింగ్ ,క్వారీ మాఫియాలు పెరుగుతు న్నాయి. కొన్ని సందర్భాలలో పోలీసులకే రక్షణ లేకుండా పోతున్నది. హత్యలు పెరుగుతున్నాయి. అప్పుల వాళ్ళ ఒత్తిడితో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. పోలీస్ స్టేషన్లో సాధారణ ప్రజలకు న్యాయం జరగడం లేదు. అధికార పార్టీ ఆదేశాలకు ,లంచాలకు, కమిషన్లకు న్యాయం జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసు అధికారులే సెటిల్మెంట్ , మట్కా, జూదం ప్రోత్సహించే సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ మాటలకే పరిమితమైంది .లాకప్ లో లాఠీ దెబ్బలకు కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కావున శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసు వ్యవస్థ చిత్తశుద్ధితో నిజాయితీగా పనిచేస్తే శాంతి భద్రతలు మెరుగవుతుంది. అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు, చట్టాలు అమలుపరచాలి. దౌర్జన్యాలు, మాఫియాలు ,లంచగొండి, మట్కా జూదం, మద్యం అరికట్టే చిత్తశుద్ధి ఉండాలి.

పట్టణాలు : జిల్లాలో పట్టణ ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయి. నంద్యాల ,ఆత్మకూరు, నందికొట్కూరు ,బేతంచెర్ల, డోను ,ఆళ్లగడ్డ మున్సిపాలిటీలు .ఇంకా శమీ అర్బన్ ప్రాంతాలు ఉన్నాయి. మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉంటున్నాయి. రోడ్లు మంచినీరు డ్రైనేజీ పరిశుభ్రత లాంటి సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయి. అంటు వ్యాధులు కూడా ఈ ప్రాంతాలలోనే తీవ్రంగా ప్రబలుతున్నాయి. నీరు సమృద్ధిగా ఉన్నా నంద్యాల, ఆత్మకూరు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. బేతంచెర్ల డోను మంచినీటి సమస్యలు ఉన్నాయి. సెమి అర్బన్‌లో నీటి సమస్యలు పరిష్కరించాలి.ప్రధానంగా మున్సిపాలిటీలలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించడం ద్వారా దోమలు అంటువ్యాధులు రాకుండా నిరోధిం చవచ్చు. నంద్యాలలో వరదలతో లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోతున్నాయి. ప్రజల ఆస్తులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నది. ప్రభుత్వానికి కూడా నష్టపరిహారం పేరుతో రూ.కోట్లు ఖర్చు చేయవలసి వస్తున్నది. వరదరక్షణ గోడ నిర్మించాలని దశాబ్దాలుగా చెబుతున్న ఆచరణలో విఫలమవుతున్నారు. కావున వరద ప్రాంతాలలో వరద రక్షణ గోడలను నిర్మించాలి.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఫ్లై ఓవర్లు, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించి రవాణాకు ఆటకం లేకుండా చేయాలి.

అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధి : పేదరికం పారద్రోలడానికి అందుకు భూమి పంచడం, ఉపాధి చూపించడం చేయాలి .జిల్లాలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు సాగు కనుకూల మైనటువంటి అటవీ భూములు ,దేవాలయ భూములు ఉంటున్నాయి. జిల్లాలో భూమిలేని పేదలను గుర్తించి ఈ భూములు పేదలకు పంచాలి. దేవాలయ భూములు పేదలకు కౌలుకు ఇవ్వాలి. సొంత భూమి ఉండడం ద్వారా ఆయా కుటుంబాలకు అంతో ఇంతో ఉపాధి దొరికి వారి జీవితాలు కొంతైనా బాగుపడతాయి. ఇళ్ల స్థలాలు ఇస్తామని గత పది సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఊరిస్తున్నాయి. ఇంతవరకు ఆ ప్రయత్నం నెరవేరలేదు. ఎన్నికల పేరుతో ఇప్పుడిప్పుడే కొంత ప్రయత్నం జరుగుతుంది. స్థలాలు సేకరించినచోట మౌలిక సదుపాయాలు లేవు. పక్కా గహాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవు అప్పుల పాలు కావాల్సి వస్తుంది.ప్రభుత్వమే పేదలకు ఇచ్చినటువంటి స్థలంలో పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి. లేదా ప్రభుత్వం ఇచ్చే నిధులు నేటి ధరలకు అనుగుణంగా పెంచాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూలి పని చేసుకునే పేదలకు 200 రోజులు ఉపాధి పనులు పెట్టి కనీస వేతనాలు ఇవ్వాలి. ప్రజల చేతికి డబ్బులు అందడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా పురోగమిస్తుంది. చౌకడిపోల ద్వారా పేదలకు 12 రకాల నిత్యవసర వస్తువులు ప్రజలకు అందించాలి. అర్హులైన వారందరికీ వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ,వితంతువులకు పెన్షన్లు ధరలకు అనుగుణంగా పెంచి ఇవ్వాలి. దళితులు మహిళలు గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తూనే వారిపై జరిగే దాడుల పట్ల కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వం వారికి అండగా ఉండాలి. అటవి ప్రాంత గిరిజనులకు భూమిని ఇవ్వడం వారు అనుభవిస్తున్న భూములకు రక్షణ కల్పించి వారు సేకరించే అడవి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి వారిని ఆదుకోవాలి. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి.

వినూత్న రీతిలో జిల్లా అభివృద్ధికి చర్యలు

- పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం
- ప్రతేడాది 15 శాతం గ్రోత్ రేటుతో ఐదేళ్ల కార్యాచరణ
- ప్రజాశక్తితో కలెక్టర్ జి.రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఉండే స్థానిక వనరులను సమర్థవంతంగా వినియోగించు కుంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ప్రతి కుటుంబానికి కనీసం రూ.25 వేల కనీస ఆదాయం వచ్చేలా ఐదు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. ప్రజాశక్తి 44 వ వార్షికోత్సం సందర్భంగా ప్రజాశక్తి తో కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా సమగ్రాభివద్ధిపై జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. ఆమె మాటల్లో....

వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ 2047 ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఐదు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. జిల్లా, మండల కేంద్రాలలో స్థానికంగా లభ్యమయ్యే దేశీయ ఉత్పత్తులు, వనరులను వినియోగించు కుంటూ ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి రేట్ పెరిగేలా కార్యాచరణ రూపొందించి సంక్షిప్త నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నాం. అభివృద్ధి సూచికల్లో జిల్లా దిగువ నుండి 5వ స్థానంలో ఉంది. ఎగువ స్థానంలో ఉన్న ఐదు జిల్లాలను పోల్చుకుంటూ ఏ విధంగా అమలు చేస్తే ఆదాయం వస్తుందో అన్వేషించి అధికారులతో నివేదికలు తయారు చేయిస్తున్నాం. ప్రతి డిపార్టుమెంట్ మనం ఏ ప్లేస్‌లో ఉన్నామో సరిచూసుకొని ఏ విధమైన డాక్యుమెంట్ సమర్పిస్తే గ్రోత్ రేట్ పెరగగలదో ఆ మేరకు విస్తృత ఆలోచనలతో నివేదికలు తయారు చేయాలి. పేదరిక నిర్మూలన దిశగానే ఐదు సంవత్సరాల విజన్ డాక్యుమెంటును నివేదికలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అన్ని శాఖలు అమలు చేస్తున్న అంశాలలో కొత్త ఆవిష్కరణలు రూపొందించి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్థానికంగా లభ్యమయ్యే వనరులతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా యూనిట్లను నెలకొల్పి కృషి చేస్తాం. హార్టికల్చర్ హబ్, టూరిజంహబ్, ఇండస్ట్రియల్ హబ్, 70 వేల హెక్టార్లలో మోనో క్రాప్ అభివృద్ధి చేస్తామనే సంకల్పాలను బలపరుస్తూ మొక్కుబడి రీతిలో కాకుండా అంకితభావంతో పనులు చేస్తున్నాం. జిల్లాలో 158 మందికి మైనింగ్ లీజులకు ఇస్తే పనులు చేయకపోవడానికి గల కారణాలు అన్వేషిస్తున్నాం. జిల్లాలో రకరకాల గ్రానైట్ ఉంది. ప్రమోట్ చేయడంలో ఎందుకు వెనుకబడి ఉన్నాం. మైనింగ్ శాఖ ద్వారా రూ.315 కోట్లు వచ్చే ఆదాయాన్ని రూ.500 కోట్ల వరకు తీసుకువెళ్లాలను కున్నాం. మాతృ శిశు మరణాలు తగ్గించడం, రక్తహీనతను అధిగమించడం, దీర్ఘకాలిక రోగాలు తగ్గించే విధంగా దూర దృష్టితో ముందుకు సాగుతున్నాం. ఆర్వో ప్లాంట్లను తగ్గించి శుద్ధజలం అన్ని గ్రామాలకు సరఫరా చేసేలా ప్రయత్నిస్తున్నాం. అటవీ సంపదను పరిరక్షించుకొనేలా ఎకో టూరిజంను అభివృద్ధి, సంక్షేమ హాస్టళ్లను మెరుగు పరచడం, చేతివృత్తుల పనిముట్లకు ప్రాధాన్యత ఇస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యవసాయం అభివృద్ధిలో పంటల సాగు పెంచేందుకు ప్రస్తుతం సాగయిన దానికి అదనంగా సాగునీటి కాలువల కింద కవరేజ్ కానీ ప్రాంతాలను గుర్తించి ఏ విధంగా అభివృద్ధి చేయగలమో ఆ మేరకు నివేదికలు తయారు చేయిస్తున్నాం.

మహిళా రక్షణకు ప్రత్యేక చర్యలు..

జిల్లాలో మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. తల్లిదండ్రులు పిల్లలను పెంచే విధానంలో మార్పు రావాలి. సొసైటీని అర్థ చేసుకునేలా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలి. విద్యాతోపాటు వినయం, సమాజంలో విలువలు, సంస్కారం నేర్పాలి. అమ్మాయిల పట్ల తల్లి, సోదరి అనే భావన కలగాలి. కుటుంబం నుండే మార్పు రావాలి. ప్రతి స్కూలులోనూ నైతిక విలువలు పెంపొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు మెస్సేజ్ ఇవ్వాలి. విద్యార్థులలు చెడును ఎప్పుడైతే విస్మరిస్తారో అప్పుడు ఆడపిల్లల పట్ల అఘాయిత్యాలు వంటివి తగ్గుతాయి.

44 ఏళ్ల ప్రజాశక్తి...

మొదటి పేజీ తరువాయి...

ప్రజాశక్తి నిర్వహించిన పాత్రపై అప్పటి పాలకులు తట్టుకోలేక నిషేధానికి గురిచేశారు. 1969లో వారపత్రికగా తిరిగి ప్రజాశక్తి పునఃప్రారంభమైంది. ఆ తర్వాత 1981 ఆగస్టు 1 నుంచి దినపత్రికగా రూపుదిద్దుకొని దాదాపు 4 దశాబ్దాలపాటు శ్రామిక వర్గం, శ్రామికవర్గానికి పీడిత, తాడితులకు, అభివృద్ధి కాముకులకు, అభ్యుదయ వాదులకు కరదీపికగా ప్రజాశక్తి కొనసాగుతోంది. భూ పోరాటమైనా, వ్యవసాయ కార్మికుల కూలి పోరాటాలైనా, అన్నదాతల ఆకలి పోరాటాలకైనా, ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసమైనా ప్రజాశక్తి 'నేనున్నాన'ంటూ వారికి అండగా నిలుస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజలు, కష్టజీవులు పడే ఇబ్బందులను ఇతర పత్రికలు పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసినా వాస్తవాలను ప్రతి బింబించేలా ప్రజాశక్తి ముందు వరుసలో నిలుస్తోంది. ఆయా వర్గాల ప్రజల మన్ననలతో ప్రజాశక్తి దినదినాభివృద్ధి చెందుతుంది. 1981లో మొదలైన ఈ పత్రిక రాష్ట్రవ్యాప్తంగా 10 ఎడిషన్లతో మిగతా పత్రికలకు ధీటుగా పోటీలో నిలబడింది. కర్నూలు జిల్లాలో సమస్యలు, ప్రజాసమస్యలు వెలికితీయడం, ప్రజా పోరాటాలను రూపొందించడంలో ప్రజాశక్తి తనదైన పాత్ర పోషించింది. 1998లో మొదటిసారి కర్నూలులో పిసి సెంటర్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడ ప్రచురణ కేంద్రంగా ఉండే ఈ పిసి సెంటర్‌కు కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం, కడప జిల్లాల వార్తలు వచ్చేవి. 2003లో కర్నూలులోనే ఎడిషన్ ప్రారంభమై స్థానిక వార్తలకు, స్థానిక ఉద్యమాలకు ప్రాధాన్యమిచ్చేలా 8 పేజీలతో జిల్లా ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. కర్నూలు, మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలకు కర్నూలులో ఉండే ప్రచురణ కేంద్రం ద్వారానే ప్రజాశక్తి దినపత్రికలు వెళ్లేవి. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణలో ప్రజాశక్తి స్థానంలో 'నవతెలంగాణ' ఏర్పడడంతో కర్నూలులో ఉన్న ప్రజాశక్తి ప్రచురణ కేంద్రం అనంతపురం, కర్నూలు జిల్లాలకు పత్రికలను పంపేది. అన్ని వర్గాల ప్రజల అండతో విస్తరణలో తనదైన ముద్ర వేసుకున్న ప్రజాశక్తి 2017లో అనంతపురంలో కూడా ప్రచురణ కేంద్రం ఏర్పాటవడంతో ప్రస్తుతం కర్నూలులో ఉన్న ప్రచురణ కేంద్రం కర్నూలు జిల్లాకు ప్రచురణ కేంద్రంగా మారింది. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, యువజనులు, మహిళలు ఇలా అన్ని వర్గాలకు ప్రత్యామ్నాయ మీడియాగా ప్రజాశక్తి నిలుస్తోంది. గతంలో కేవలం పట్టణ ప్రాంతాలు, జిల్లా ప్రాంతాలకే పరిమితమైన పత్రిక మారుమూల గ్రామాలకు కూడా వెళుతోంది. జిల్లాలోని 54 మండలాలకు ప్రజాశక్తి వెళుతోంది. వ్యాపార ధోరణికి భిన్నంగా ప్రజల్లో ప్రజాస్వామిక చైతన్యాన్ని రగిల్చే పాత్ర పోషిస్తోంది. వార్తలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ప్రజాశక్తి ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కరువు ఏర్పడినప్పుడు అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి పేదల ఆకలితీర్చింది. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించింది. 2009లో వచ్చిన వరదల సందర్భంగా కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వైద్యశిబిరాలు నిర్వహించింది. సర్వంకోల్పోయిన వారికి స్టౌలు, వంటపాత్రలు, దుస్తులు పంపిణీ చేసింది. శ్రమదానం చేసి కర్నూలు ఓల్డ్‌టౌన్‌లో బురదమట్టిని, చెత్తాచెదారంను తొలిగించింది. వివిధ సందర్భాల్లో ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక సంచికలు ప్రచురించింది. అవగాహన సదస్సులు నిర్వహించింది. కరోనా మహమ్మారి విస్తరించిన సందర్భంగా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. అన్నార్థులు, దినసరి కూలీలు తిండిదొరక్క ఇబ్బందులు పడ్డారు. వారి కాలేకడుపులు నింపేందుకు ప్రజాశక్తి సిబ్బంది 15 రోజులు వంటలు చేసి కర్నూలు నగరంలో ప్రధాన కూడళ్లలో ఆహారం అందించారు. రేషన్ కార్డులు లేని కొన్ని కాలనీలను గుర్తించి బియ్యం, పప్పు, మంచినూనె తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



కరోనా నేపథ్యంలో ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది



ప్రజాశక్తి కలర్ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ ముఖేష్‌కుమార్‌మీన



కర్నూలు ఎడిషన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కీర్తిశేషులు నగరూరు సుబ్రమణ్యం

ఆహ్లాదకరం... అహోబిలం

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న క్షేత్రం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

108 దివ్య క్షేత్రాలలో అహోబిల నారసింహ క్షేత్రం ఒకటి. నల్లమలలో నవనారసింహ క్షేత్రాలు ప్రసిద్ధి. ఈ క్షేత్రానికి నిధి, నగరి అని పేర్లు. తమిళులు అహోబిల క్షేత్రాన్ని శింగవేల్‌కుంద్రం అని పిలుస్తుంటారు. నవనారసింహులు వెలసి నందువల్ల అహోబిల క్షేత్రం నవ నారసింహ క్షేత్రం అని పిలుస్తుంటారు. ఈ క్షేత్రానికి చేరుకునేందుకు జిల్లా కేంద్రం నుండి 134 కిలోమీటర్ల దూరం వుంది. కర్నూలు నుండి ఆళ్లగడ్డకు చేరుకొని అక్కడ నుండి దిగువ అహోబిలానికి 24 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వుంటుంది. అక్కడ నుండి 8 కిలోమీటర్ల దూరంలో నల్లమల అరణ్యంలో శ్రీ నరసింహస్వామి స్వయంభువుగా వెలసిన ఎగువ అహోబిల క్షేత్రం వుంది. ఎత్తైన వృక్షాలతో, పక్షుల కిలకిలా రావాలతో, గలగల పారే ప్రకృతి సెలయేర్ల సవ్వడుల నడుమ అహోబిల అందాలు పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తాయి. ఎగువ అహోబిలం ఆలయ సమీపంలో జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. దిగువ అహోబిలం నుండి ఎగువ అహోబిలంకు వెళ్లే రస్తాలో రోడ్డు కిరువైపులా బుసలు కొట్టే విధంగా గాలికి పెద్ద పెద్ద వృక్షాల సైతం ఊగుతూ అహ్లాదకరంగా వుంటాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నల్లమలలో కొండలపైన నరసింహ స్వామి ఈ క్షేత్రంలో 9 అవ తారాలలో దర్శనమిస్తారు. జ్వాలా, అహోబిల, మాలోలా, క్రోడా(వరాహ), కారంజ, భార్గవ, యోగానంద, ఛత్రవట, పావన(పాములేటి) నరసింహ స్వామిలు వెలసి వున్నారు. నవ నారసింహు లను చేరుకోవాలంటే అత్యంత శ్రమతో కూడుకున్న పని. పూర్వము అహోబిల క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం రాజులు ఎన్నో కోనేర్లు, బావులు తవ్వించారు. అహోబిల క్షేత్రం ఎంతో ప్రాశత్స్యం సంతరించు కుంది.



స్వాతి దర్శనంతో సకల పాపాలు దూరం : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా నవ నార సింహులను కాలి నడకన దర్శించుకుంటే సకల పాపాలు తొలగుతా యన్నది భక్తుల నమ్మకం. ప్రతి 27 రోజులకు ఒకసారి వచ్చే స్వాతి రోజు వేకువఝాము నుండే భక్తులు నవ నారసింహులను దర్శించు కుంటుం టారు. స్వాతి దర్శనానికి వెళ్లే వారికి పావన, వరాహ, మాలోలా, కారంజ, యోగానంద ఆలయాల వద్ద భక్తులు అన్నదానం ఏర్పాటు చేస్తారు.

పావన క్షేత్రంలో (పాములేటయ్య) వారాలు : ప్రతి సంవత్సరం ఉగాది పండుగ తర్వాత వారం నుండి పాము లేటయ్య వారాలు ప్రారంభమవుతాయి. వారోత్సవాల లో ప్రతి శనివారం వేల సంఖ్యలో భక్తులు పాములేటయ్యకు అరణ్యమార్గం గుండా 10 కిమీ. ప్రయాణించి స్వామికి తమ మొక్కు బడులు తీర్చుకుంటారు. ఊట్ల మీదుగా వెళ్లే రహదారిని అటవీశాఖ దాదాపు రూ. 18 లక్షల వ్యయంతో గుంతలమయంగా వున్న రహదారిని బాగుచేశారు. ట్రాక్టర్లు, లారీలు, జీపులు, మోటర్‌సైకిళ్లపై భక్తులు సులభంగా పావన క్షేత్రం చేరుకోవచ్చు, కాలినడకన వెళ్లే భక్తులు ఎగువ అహోబిలం చేరుకొని అక్కడ నుంచి మెట్ల మార్గం గుండా అడవిలో కాలినడకన పావన క్షేత్రం చేరుకోవచ్చు. వారోత్సవాలలో కాకుండా ప్రతి శనివారం కూడా భక్తులు తమ తమ వాహనాలలో పావన క్షేత్రం చేరుకొని తమ మొక్కుబడులు తీర్చుకుంటారు.

యోగానందక్షేత్రం (కాశిరెడ్డి నాయన ఆశ్రమం)లో అన్నదానం : నవ నారసింహులలో ఒకరైన యోగానంద నరసింహ క్షేత్రం (కాశిరెడ్డినాయన నెలకొల్పిన ఆశ్రమం)లో గత 30 సంవత్సరాలకు పైగా వచ్చిన భక్తులకు లేదనకుండా నిర్వాహకులు అన్నదానం చేస్తున్నారు. దిగువ అహోబిల క్షేత్రం నుండి 2 కి.మీ దూరంలో ఈ క్షేత్రం వుంది.

ప్రహ్లాదబడి : హిరణ్యకశ్యపుని కుమారుడు ప్రహ్లాదుడు చిన్నవయస్సులో విద్యాబుద్ధులు నేర్చుకున్న చోటు ప్రహ్లాదబడి. మాలోలా ఆలయం నుండి కొంత దూరం ప్రయాణిస్తే ప్రహ్లాదబడి కొండ గుహలో దర్శనమిస్తుంది. అక్కడ అలనాడు ప్రహ్లాదుడు చదువుకొన్న చిన్ననాటి జ్ఞాపకాలలతో పాటు నరసింహస్వామి విగ్రహం కనిపిస్తుంది

ఉగ్రస్తంభం : నవనారసింహులలో ఒకరైన శ్రీ జ్వాలానరసింహస్వామి వెలసిన ఆలయం కొండపై చివరగా ఉగ్రస్తంభం కనిపిస్తుంది. ఈ ఉగ్రస్తంభంకు చేరుకోవాలంటే శ్రమించక తప్పదు. ఉగ్రస్తంభం చుట్టూ తిరిగి స్వామిని దర్శించుకుంటారు.

అహోబిలేసుని దర్శించుకున్న ప్రముఖులు : ఈ క్షేత్రానికి గతంలో ఉపరాష్ట్రపతి శంకర్‌దయాల్‌శర్మ, మాజీ ప్రధాని దేవగౌడ, గవర్నర్‌లు ఈఎస్‌ఎల్ నరసింహన్, కృష్ణకాంత్, సుశీల్‌కుమార్‌షిండే, ముఖ్యమంత్రులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అనేక మంత్రులు అహోబిలేసున్ని దర్శించుకునేందుకు వచ్చారు.

సినిమా షూటింగ్‌లకు నిలయం అహోబిలం : అహోబిల క్షేత్రంలో ఎన్నో సినిమాలు రూపుదిద్దుకున్నాయి. అలనాడు ఎస్వీ రంగారావు, ఎన్‌టి రామారావుల నుండి ప్రస్తుతం ప్రభాష్‌ల వరకు ఎందరో కథానాయకులు అహోబిలంలో చిత్రీకరించిన సినిమాలలో పాల్గొన్నారు. అందులో భాగంగా ఉత్తమురాలు, బందిపోటు భీమన్న, శ్రీ పోతులూరి వీరభ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర, శ్రీ కాశిరెడ్డినాయన జీవిత చరిత్ర, దేవతలారా దీవించండి, దొంగలరాజ్యం, అడవిమనిషి, తోకలేనిపిట్ట, ఒక్కమగాడు, సీమసింహం, శంభోశివ శంభో, మిస్టర్‌ఫర్‌పెక్ట్, అన్నమయ్య, సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు, బంగారి బాలరాజు తదితర చిత్రాలు అహోబిలంలో రూపుదిద్దుకున్నాయి. ప్రభాష్ నటించిన రాధేశ్యాం సినిమా షూటింగ్ కూడా అహోబిలంలో జరిగింది.



సంక్షోభంలో నాపరాయి పరిశ్రమ

- జిఎస్‌టితో తగ్గిన కలర్‌స్టోన్ అమ్మకాలు - మూతపడుతున్న పాలిష్ ఫ్యాక్టరీలు
- కొరవడి ప్రభుత్వ ప్రోత్సాహం - తగ్గుతున్న ఉపాధి అవశాకాలు

కేంద్ర ప్రభుత్వం కలర్‌స్టోన్స్‌కు 28 శాతం పన్ను విధించడంతో రాళ్ల అమ్మకాలు నిలిచిపోయాయి. కరెంటు బిల్లులు పెరగడం, రాయల్టీ మోపడం, జిఎస్‌టితో పన్ను అధికం కావడంతో బేతంచర్ల కలర్‌స్టోన్స్‌ను కొనేవారు తక్కువయ్యారు. యజమానులు పరిశ్రమలను నడపలేక మూసివేస్తున్నారు. బ్యాంకుల అప్పుల తీర్చలేక, కరెంటు బిల్లులు చెల్లించలేక యజమానులు ఫ్యాక్టరీలను మూసి వేస్తుండడంతో కార్మికులకు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారు. పాలీష్ ఫ్యాక్టరీలను నమ్ముకొని వేలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కొత్తగా పరిశ్రమలు తెచ్చి వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నాయి. పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోతున్నా పట్టించుకోవడం లేదు.

ప్రజాశక్తి - బేతంచెర్ల

350 నుంచి 450 దాకా ఫ్యాక్టరీలు ఉండేవి. అందులో 3500 నుంచి 4000 వరకు కార్మికులు పని చేసేవారు. ముడిసరుకును పెద్దబిలుకు, ముచ్చట్లబిలుకు, హెచ్‌కొట్టాల, గిన్నెబిలుకు, నడ్డిపెంట ప్రాంతాల నుంచి వైట్‌స్టోన్ వచ్చేది. దాదాపు 10 గ్రామాల నుంచి ముడి సరుకును బేతంచెర్లకు చేర్చేవారు. బనగానపల్లె మండలం పల్కూరు, రామకృష్ణాపురం, గోవిందిన్నె, బీరెల్లి ప్రాంతాల నుంచి బ్లాక్‌స్టోన్ సేకరించేవారు. క్రమంగా వైట్‌స్టోన్ సేకరణ తగ్గిపోయింది. టైల్స్, గ్రానైట్ దిగుమతి కావడంతో ఇక్కడి రాళ్లకు గిరాకి తగ్గింది. బ్లాక్‌స్టోన్ ఒక్కటే కొన్ని దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వాటిలో మలేసియా, సింగపూర్, ఖాట్మండ్, దుబాయి తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

యుద్ధం వల్ల తగ్గిన ఎగుమతి : రెండు, మూడేళ్ల నుంచి రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచిపోయాయి. వ్యాపారం మందగించింది. కార్మికులు పనిదినాలు కోల్పోయారు. 450 ఫ్యాక్టరీలలో 100 నుంచి 150 ఫ్యాక్టరీలు మూతబడ్డాయి.



తగ్గిన ప్రభుత్వ ప్రోత్సాహం: ప్రభుత్వాలు పరిశ్రమలను ప్రోత్సహించడం తగ్గించారు. రాయల్టీ, రకరకాల ట్యాక్సులు, విద్యుత్ బిల్లులు పెంచారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. దీనిని కుటీర పరిశ్రమగా గుర్తించాలని నమ్మించి ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యా లు కార్మికులకు ఇవ్వడం లేదు. కార్మికులు ప్రమాదాల్లో చనిపోతే ఎలాంటి పరిహారం వారి కుటుంబాలకు ఇవ్వరు. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక సంఘాలు కొద్దిపాటి ఆదాయంతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది.



ప్రభుత్వానికి తగ్గిన ఆదాయం : ఫ్యాక్టరీలో పని తగ్గి ఎగుమతులు తగ్గడంతో ప్రభుత్వానికి రావల్సిన రూ.వేల కోట్ల ఆదాయం తగ్గిపోయింది. రాయల్టీ, విద్యుత్ బిల్లుల వివిధ రూపాల్లో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది.

తగ్గిన రవాణా: బేతంచెర్లలో గతంలో 675 లారీలు పని చేసేవి. ప్రస్తుతం 525కు తగ్గాయి. ఇక్కడి నుంచి 100 నుంచి 150 లారీలకు ప్రతిరోజు లోడింగు చేసేవారు. ప్రస్తుతం ఒకలారీ లోడ్ చేయడానికి రెండు, మూడు రోజులు పడుతుంది. దీంతో హమాలీలకు పని తగ్గింది. లారీలకు ట్యాక్స్ రూపంలో ఏడాది 7500 చెల్లించే వారు. ప్రస్తుతం 22500 పెంచారు. 30 శాతం టాక్సు పెంచారు. దీనికి తోడు పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగాయి. ఇలాంటి భారాలు కట్టలేక, ఫైనాన్సులు కట్టలేక లారీలు , ఇతర వాహనాలు తగ్గాయి. పాలిస్ ఫ్యాక్టరీలు కూడా క్రమంగా తగ్గాయి. ఇక్కడ పని చేసే కార్మికులు కూడా తగ్గారు. గతంలో 2000 మంది పాలిస్ ప్యాక్టరీలలో ఉపాధి పొందేవారు. ఇక్కడ లెక్కలు రాసే గుమస్తాలు 150 నుంచి 200 మందికి ఉపాధి లభించేది. అదికూడా సగానికి సగం తగ్గింది. మొత్తగా ఇక్కిడి కార్మికులు వలసలు పోతున్నారు. మహారాష్ట్రలోని ముంబయి, తెలంగాణాలోని హైదరాబాద్‌కు, కర్ణాటకలోని బెంగళూరుకు ఉపాధి కోసం వెళుతున్నారు. దీంతో ఇక్కడ 4500 మంది కార్మికులను 3000 తగ్గారు.

పెరిగిన వలస కార్మికులు : ముడిసరుకు తీయడంలో పాలిస్ ఫ్యాక్టరీలలో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు బేతంచెర్లకు వస్తున్నారు. తక్కువ కూలీకి ఎక్కువ పని గంటలు పని చేస్తారని బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి కార్మికులు వచ్చారు. వారికి ఇక్కడ కనీ సౌకర్యాలు లేదు. తాత్కాలిక షెడ్లలో జీవనం వెళ్లదీస్తున్నారు.

సంక్షోభంలో బేతంచెర్ల నాపరాతి పరిశ్రమ

ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రంలోనే కాక ఉత్తరాదిలోనూ ప్రజలకు బేతంచెర్ల కలర్ నాపరాళ్లు సుపరిచితమే. నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల రంగురాళ్లు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ప్రజలు నిర్మించుకునే అన్ని రకాల గృహాల్లో వివిధ డిజైన్లలో దర్శనమిస్తున్నాయి. వివిధ రకాలైన అందమైన నాపరాళ్లు బేతంచెర్ల నుంచి ఆయా రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. దశాబ్దాలుగా నాపరాతి వ్యాపారంలో దక్షిణాది రాష్ట్రాల్లో బేతంచెర్ల ఖ్యాతిని నిలుపుకుంటూనే ఉంటుంది. జిల్లా కేంద్రం నంద్యాలకు 49.2 కిలోమీటర్ల దూరంలో ఉన్న బేతంచెర్ల వ్యవసాయ అభివృద్ధికి సహజ నీటి వనరులు లేకున్నా పరిసర ప్రాంతాల్లోని భూగర్భంలో అపారమైన నాపరాతి ఖనిజ నిక్షేపాలున్నాయి. బేతంచెర్ల ప్రాంతంలో స్లాబ్ పాలీషింగ్, ఫ్యాక్టరీ, పౌడర్ మేజక్ చిప్స్ ఫ్యాక్టరీలు, నల్ల నాపరాయి విక్రయించే డిపోలు సుమారు 400 వరకూ బేతంచెర్ల పట్టణంలో ఉన్నాయి. బేతంచెర్ల నుంచి రోజూ 150 లారీల నాపరాయిని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుండేవారు. వేలాది మంది ఈ ప్రాంతాల్లో జీవనోపాధి పొందెవారు. నాపరాతి గనుల్లో, ఫ్యాక్టరీల్లో లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉపాధి విషయంలో పది వేల కుటుంబాలు పై వరకూ జీవనోపాధి పొందేవి. బేతంచెర్ల, డోన్ మార్గమధ్యంలో చిన్న మల్కాపురం మెజాయిక్ చిప్స్ ఫ్యాక్టరీలు ప్రసిద్ధి. ఈ మెజాయిక్ చిప్స్‌ను గూడ్స్ వ్యాగన్లు, లారీల ద్వారా కలకత్తా రాష్ట్రానికి రవాణా చేసేవారు. అవితగ్గిపోయాయి. విద్యా, వైద్య, గృహ వసతి సౌకర్యాలు కార్మికులకు వర్తింపజేయడం లేదు. ఇక్కడ దొరికే రంగురంగుల నాపరాయి బిల్లలను మెజాయిక్ చిప్స్ చేయడానికి బేతంచెర్ల పరిసర ప్రాంతాల నుంచి ఫ్యాక్టరీలకు వస్తుంటారు. వీటిలో తయారైన వివిధ కలర్స్ మెజాయిక్ చిప్స్ రాజస్తాన్, కర్ణాటక, అమరావతి, నాగపూర్ వంటి ప్రాంతాలకు లారీల ద్వారా రవాణా చేసేవారు. క్రమంగా తగ్గాయి. బేతంచెర్ల ప్రాంతంలో దొరికే రంగురంగుల నాపరాయి బిల్లలను డిజైన్ చేయడానికి బేతంచెర్ల ప్రాంతం నుంచి కార్మికులు గోవా, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ నూతనంగా నిర్మించిన భవనాల్లో బేతంచెర్ల నాపరాయితో కలర్స్, డిజైన్స్ చేసి వేలాది మంది ఉపాధి పొందేవారు. అది పూర్తిగా తగ్గింది. కాంట్రాక్ట్ పనుల్లో కొందరు, సొంతంగా మరికొందరు ఉపాధి పొందుతూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగానే కాక, దేశవ్యాప్తంగా కూడా బేతంచెర్ల నాపరాయి గృహ అలంకరణకు ఎంతో ఆకర్షించేది. వేసవిలో చల్లదనం ఇస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహమూ లేదు. బేతంచెర్ల ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. బేతంచెర్ల కలర్ నాపరాతిని ఉపయోగించి గృహాలకు, భవంతులకు శోభను తెస్తుండడంతో బేతంచెర్ల నాపరాతికి విపరీతమైన గిరాకీ ఏర్పండింది. ఒకప్పుడు ఎంతో ప్రఖ్యాతి గాంచిన బేతంచర్ల రంగురాళ్లు నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం పాలీష్ ఫ్యాక్టరీలకు రాయితీలు కల్పించి, పరిశ్రమలకు పూర్వ వైభవం తీసుకు రావాలని కార్మికులు, ఫ్యాక్టరీ యజమానులు కోరుతున్నారు.



కార్మికుల హక్కుల కోసం పోరాటాలు

కార్మికుల హక్కుల కోసం గతంలో అనేక పోరాటాలు జరిగాయి. ప్రస్తుతం కూడా చేస్తున్నారు. కార్మికలకు ఇఎస్ఐ, పిఎఫ్, మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం ప్రభుత్వ కల్పించాలని 2008 సంవత్సరంలో 38 రోజులు, 2010లో 42 రోజులు సమ్మె చేశారు. పాలిస్ ప్యాక్టరీ వర్కర్స్ యూనియన్, లారీట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ యూనియన్లను ఐక్యం చేసి సిఐటియు నాయత్వంలో పోరాటం చేశారు.



టిటిడి తరహాలో శ్రీశైలం అభివృద్ధి

-2వేల మందికి డార్మిటరీ నిర్మాణం -ఆధునిక పద్ధతిలో క్యూకాంప్లెక్స్‌లు
-క్షేత్రం చుట్టూ పెన్సింగ్ -ప్రజాశక్తితో శ్రీశైలం దేవస్థానం ఇఒ డి.పెద్దిరాజు



ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

'తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. రాబోయే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేశాం. భక్తులకు శీఘ్ర దర్శనాల కోసం క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నాం. శివసేకులకు ప్రత్యేక వసతి గృహం, రెండు వేలమందికి డార్మిటరీ నిర్మాణం, క్షేత్రం చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేయనున్నాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవస్థానం ఆవరణంలో ఆహ్లాదకరమైన పార్కులు, చక్కటి సౌకర్యాలు కల్పిస్తాం.' అని శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అన్నారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు..

టిడిపి తరహాలో శ్రీశైలం అభివృద్ధి చేస్తారనే చర్చ జరిగింది. ఎంతవరకు వచ్చింది?.

ఇఒ: తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. రాబోయే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేశాం. భక్తులకు శీఘ్రగతిన దర్శనాల కోసం ఆధునిక పద్ధతిలో క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నాం. శివసేకులకు ప్రత్యేక వసతిగృహం ,రెండు వేలమందికి డార్మిటరీ నిర్మాణం, క్షేత్రం అడవిలో ఉన్నందున జంతువులు వంటివి దేవస్థానంలోకి రాకుండా భక్తుల రక్షణకోసం చుట్టూ ఫెన్సింగ్ నార్మాణం చేయనున్నాం. సుదూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు దేవస్థానం ఆవరణంలో ఆహ్లాదకరమైన పార్కులు, చక్కటి సౌకర్యాలు కల్పిస్తున్నాం. తిరుమల తరువాత ఇప్పటికే భక్తులకు కావల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. తిరుమల తరువాత 4వేల గదులు ఇక్కడే ఉన్నాయి. వికలాంగుకు వీల్‌ఛైర్స్ ఏర్పాటు చేశాం.

తాగునీరు, పారిశుధ్యానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?.

ఇఒ: తాగునీటి కోసం 38 ఆర్‌ఒప్లాంట్లు ఉన్నాయి. మరో నాలుగు ఆర్‌ఒ ప్లాంట్లను క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉండే వారికోసం ఏర్పాటు చేశాం. పారిశుధ్యం కోసం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజుల సత్రం నుంచి శివాజీ స్ఫూర్తికేంద్ర వరకు సుందరీకరణకు చర్యలు తీసుకున్నాం. సర్కిల్స్‌ను వైండింగ్ చేశాం. డివైడర్స్, సర్కిల్స్ శివరాత్రికి, ఉగాదికి బాగా ఉపయోగపడ్డాయి. వనాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. 5 వేల మొక్కలు నాటాం. శివునికి ఇష్టమైన బిల్వవనం ఏర్పాటు చేశాం. భక్తులు ఓపెన్ ప్రాంతంలో విశ్రాంతి తీసుకోవడానిక కావల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

విద్యా వికాస, సాంస్కృతిక కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నారు?.

ఇఒ: దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఒక ఆగమ పాఠశాల నిర్వహిస్తున్నాం. కమిటీ ద్వారానే విద్యార్థుల ఎంపిక ఉంటుంది. శైవ ఆగమం, సంస్కృతం వంటివి నేర్పిస్తారు. భక్తులకోసం 365 రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. బయటి కళాకారులను, గాయకులను పిలిపించి కార్యక్రమాలు నిర్వహిస్తాం. శ్రావణమాసంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి.

వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.?

ఇఒ: దేవస్థానం ఆధ్వర్యంలో హాస్పిటల్ నిర్వహిస్తున్నాం. వెంటిలేటర్ సౌకర్యం ఉంది. బ్యాటరీ కార్లు, నాలుగు అంబులెన్స్‌లకు దాతలు రూ.50 లక్షలు ఇచ్చారు. వెంటిలేటర్‌కు రూ.16లక్షలు ఇచ్చారు. ఆరునెలలో 10 వాహనాలు కొన్నాం. బ్యాటరీకార్లు, రికవరీ వాహనాలు, బోయింగ్ వెహికిల్ దాతలు, దేవస్థానం కలిపి కొన్నాం.

శివరాత్రికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తారు?

ఇఒ: శివరాత్రికి, ఉగాదికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. 10 ఉచిత బస్సులు 11 రోజులు ఏర్నాటు చేశాం. టెంట్లు, హాళ్లు, లైటింగు, పార్కింగులు, రెస్టు తీసుకోవడానికి భక్తులకు సౌకర్యాలు చేశాం. పబ్లిక్ టాయిలెట్స్ , ట్రాక్టర్లు , ఎలాంటి ఇబ్బంది రాకుండా కావల్సిన ఏర్పాట్లన్నీ చేశాం. ఉగాదికి కన్నడలో ఫారెస్టు ఏరియాలో దారివెంట బోర్డులు ఏర్పాటు చేశాం. తాగునీరు, స్నానపుగదులు, స్నానాలకు కావల్సిన నీటిని అందుబాటులో ఉంచాం.

దేవస్థానంలో సిబ్బంది ఎంతమంది ఉన్నారు?

ఇఒ: రెగ్యులర్ ఉద్యోగులు 250, కాంట్రాక్టు ఉద్యోగులు 250, మిగతా ఔట్ సోర్సింగు ఉద్యోగులు కలిపి 1500 మంది పని చేస్తుంటారు.

దేవస్థానం ఆదాయం ఖర్చులు ఎలా ఉన్నాయి.?

ఇఒ: దేవస్థానం ఆదాయం బాగుంది. ఖర్చులు మీట్ అవుతున్నాం. మిగులును దేవస్థానం పేరున ఎఫ్‌డిఆర్‌లు కూడా చేస్తున్నాం.

మీరు ఇప్పటి వరకు ఎక్కడెక్కడ ఉద్యోగం చేశారు?

ఇఒ: మాది భీమవరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్‌సైన్స్ డబుల్ ఎంఎ చేశాను. మొదట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేశాను. సర్వీస్‌సెలక్షన్ కమిషన్ ద్వారా ఉద్యోగం పొందాను. శ్రీకాళహస్తి, ద్వారకా తిరుమల తరువాత శ్రీశైలంకు వచ్చాను.


మీ ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా ఉందా? లక్ష్యం నెరవేరిందా?

ఎఒ: వేలమంది భక్తులకు సౌకర్యాలు మెరుగుపరిచి సేవచేసే అవకాశం వచ్చింది. ఎంతో సంతృప్తికరంగా ఉంది. ఇంతకంటే గొప్పలక్ష్యం నాకేముంటుంది.

ఆళ్లగడ్డ శిల్పకళకు అంతర్జాతీయ ఖ్యాతి

- అపరబ్రహ్మలు ఆళ్లగడ్డ శిల్పులు


శిల్పి రవీంద్రాచారి


శిల్పి జయకృష్ణమాచారి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

శిల్పకళల గడ్డ ఆళ్ళగడ్డ... కఠినమైన శిలను సైతం అందమైన, ముగ్ధ మనోహరమైన శిల్పంగా తీర్చిదిద్దడంలో ఇక్కడి శిల్పులది అందెవేసిన చేయి... శిల్పులు తమ ప్రతిభా పాటవాలను చాటి శిల్పకళలో ఆళ్ళగడ్డకు ఆంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చారు. రాజులు పోయి, రాజ్యాలు అంతరించినా ఆళ్ళగడ్డ శిల్పకళ వైభవం కొనసాగుతునే ఉంది. బండరాళ్ళపై శిల్పాలు చెక్కుతూ సృష్టికి ప్రతి సృష్టి చేస్తూ ఆళ్ళగడ్డ శిల్పులు అపరబ్రహ్మలుగా నిలిచారు. గతంలో వేళ్ళమీద లెక్కించే శిల్పులు ఉన్న ఆళ్ళగడ్డలో నేడు వందల సంఖ్యలో ఉన్నారు. కర్నూలు–కడప జాతీయ రహదారిపై పట్టణశివార్లలో ఒక కాలనీ వెలసిందంటే ఆళ్ళగడ్డలో ఎంతమంది శిల్పులు శిల్పకళపై జీవిస్తున్నారో అర్ధమవుతోంది. ఆళ్ళగడ్డ శిల్పకళను పరిశీలిస్తే 1950లో మొదటగా అభినవ జక్కనాచార్య బిరుదాంకితుడు దివంగత దురుగడ్డ బాలవీరాచారి శారదా శిల్పకళా మందిరాన్ని ఏర్పాటుచేసి అనేకమంది శిల్పకళా రంగంపై మక్కువ చూపేలా కృషి చేశారు. ఆయన కుమారుడు దురుగడ్డ రామ కృష్ణమాచార్యులు 5 సంవత్సరాల క్రితం ఉగాది పండగ సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. తండ్రినుంచి నేర్చుకున్న శిల్పకళను అదేబాటలో రామ కృష్ణమాచార్యులు తనకుమారులైన జగదీశ్వరా చారి, బాలమురళీఆచారి, బాల సుబ్రమణ్యం ఆచారి, జయ కృష్ణమా చార్యులను శిల్పులుగా తీర్చిదిద్దారు. శిల్పకళలో 40 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న రామకృష్ణమాచార్యులు ఎన్నో సత్కారాలను అందుకున్నారు. అలాగే రామకృష్ణమాచార్యులు సోదరుడు రవీంద్రాచారి కూడా శారదా శిల్పకళామందిరాన్ని స్థాపించి అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారు. శిల్పకళలో రవీంద్రాచారి సతీమణితోపాటు, కుమార్తె భువన కూడా రాణించడం విశేషం. రవీంద్రాచారి ఎన్నో అవార్డులను సత్కారాలను అందుకున్నారు. అలాగే రవీంద్రాచారి కుమారుడు శేఖర్ఆచారి శిల్పకళలో రాణిస్తున్నారు. వీరే కాక శ్రీ లక్ష్మీశంకర శిల్పకళామందిరం నిర్వాహకులు ఇడమకంటి శంకరాచారి తదితరులు శిల్పకళకు వన్నె తెస్తున్నారు. వీరే కాక ముస్లింలు కూడా శిల్పకళారంగంలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. శ్రీ మహాసాయి శిల్పకళామందిరం నిర్వాహకులు ఖాశీంపీరా (బాషా) శిల్పకళలో రాణిస్తున్నారు. ఇలా అనేకమంది ఆళ్ళగడ్డ శిల్పులు శిల్పకళలో రాణిస్తూ ఆళ్ళగడ్డ ఖ్యాతిని అంతర్జాతీయంగా ఇనుమడింపచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరిగుట్ట క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం శిల్పాలను ఏర్పాటు చేసింది. అక్కడ శిల్పాలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఆళ్లగడ్డ శిల్పులకు పనులు అప్పజెప్పారు. వారు పనులను పూర్తి చేశారు. ఈ శిల్పాలను శిల్పులు బాల సుబ్రమణ్యం ఆచారి, జయ కృష్ణమా చారి, బాలమురళి ఆచారి, రవీం ద్రాచారి, హరిప్రసాద్ ఆచారి, సుబ్ర మణ్యం ఆచారి తదితరులు తయారు చేశారు. తెలంగాణాలోని యాదగిరి గుట్ట శిల్పాల నిర్మాణం ప్రారంభం కావడంతో ఆళ్లగడ్డ శిల్పుల ప్రతిభ మరింతగా ఖ్యాతికెక్కింది. కాగా ఆళ్ళగడ్డలో శిల్పకళ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు పాఠ్యాంశాలలో శిల్పకళను చేర్చాలని అలాగే బ్యాంకులు శిల్పులకు లోన్లు సకాలంలో ఇవ్వాలని శిల్పులు కోరుతున్నారు. ప్రభుత్వం కూడా సహకారం అందిస్తే శిల్పకళను మరింతగా ముందుకు తీసుకెళ్తామని శిల్పులు తెలిపారు.

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు

నందికొట్కూరు గేట్ వే



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్




ప్రజాశక్తి - పాములపాడు

రాయలసీమ జిల్లాలకు సాగునీటి ప్రాజెక్టులకు నందికొట్కూరు నియోజకవర్గం ప్రధాన ముఖద్వారం నందికొట్కూరు డివిజన్లోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా ఉమ్మడి కడప జిల్లా ,ఉమ్మడి అనంతపురం, ఉమ్మడి చిత్తూరు నెల్లూరు జిల్లాల వరకు సాగునీరు అందుతుంది ఏ ఏ ప్రాజెక్టులు ద్వారా ఎంత నీరు అందుతుంది అన్నది వివరాలు చూద్దాం...

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం:

ఈ ఎత్తిపోతల పథకం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి కేసికినాలకు తుంగభద్ర నుండి సాగునీరు అందనప్పుడు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కేసి కెనాల్ ఆయకట్టుకు ఐదు టీఎంసీల నీటిని నాలుగు పంపుల ద్వారా 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తారు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో కెసి కెనాల్ ఆయకట్టు కింద ఉన్న రైతాంగానికి తుంగభద్ర నుండి నీరు రాసినప్పుడు పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పుడు కేసి రైతాంగానికి పంటలు ఎండిపోకుండా పండుతున్నాయి ముచ్చుమరి ఎత్తిపోతల పథకం కేసి ఆయకట్టు రైతాంగానికి ఓ వరం లాంటిది...



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కేసికినాలకు నీటిని వదిన దృశ్యం


పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి రాయలసీమ జిల్లాలకు 1 2 గేట్ల ద్వారా 80 వేల క్యూసెక్కుల నీటిని కింది జిల్లాలకు వదిలేందుకు అవకాశం ఉంది. మొదట ఆరు గేట్ల ద్వారా నిర్మించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ అప్పట్లో 44 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే కింది జిల్లాలకు వెళ్ళేది కానీ వర్షాలు ఎక్కువ పడి వరదలు వచ్చినప్పుడు నీటిని వృధాగా సము ద్రంలో కలవకుండా రాయలసీమ లోని రిజర్వాయర్లు, చెరువులను నింపుకునే ందుకు అవకాశంగా ప్రభుత్వాలు ఎస్సార్ ఎం సి కాలువలను విస్తరణ చేసి 80 వేల క్యూసెక్కులు నీటిని కింది జిల్లాలకు పంపించేందుకు కాలువలన విస్తరణ పనులు చేయడం జరిగింది. ప్రధానంగా పోతి రెడ్డిపాడు నుండి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న బానకచర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వరకు 80 వేల క్యూసెక్కుల నీరు కాలువలో వచ్చే విధంగా విస్తరణ చేపట్టారు. అక్కడ నుండి ఎస్సార్ బీసీ, ఎస్కేపి, టిజిపి, గాలేరి నగరి సృజల ప్రవంతి కాలువల ద్వారా నీరు వెళుతుంది. బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుండి మూడు కాలువల ద్వారా క్రింది జిల్లాలకు నీరు వెళుతుంది. ఏయే కాల్వ ద్వారా ఎంత నీరు వెళుతుంది.

గాలేరి నగరి సృజల స్రవంతి (ఎస్ఆర్‌బిసి)

ఈ కాల్వ సామర్థ్యం మొదట 22 వేల క్యూసెక్కుల నీరు పంపించేందుకు వీలుగా ఉండేది ప్రస్తుతం ఈ కాలువ సామర్థ్యం 30 వేల క్యూసెక్కుల నీరు అందించేందుకు విస్తరణ చేపట్టారు. ఈ కాలువ ద్వారా అలగనూరు రిజర్వాయర్, అవుకు రిజర్వాయర్, గోరుకల్లు, మీదుగా కడప జిల్లా గండికోట పైడిపాలెం డ్యాములకు రాయలసీమ జిల్లాలకు ఈ నీరు అందుతుంది.

పై కాలువల విస్తరణ పనులన్నీ కూడా పూర్తి కాలేదు. విస్తరణ పనులు, లైనింగ్ పనులు అన్ని పూర్తి చేసుకున్నట్లయితే అధిక వర్షాలు కురిసినప్పుడు రాయలసీమ చెరువులు రిజర్వాయర్లు అన్నిటిని నింపుకున్న ట్లయితే వర్షాలు కురవక ఒక సంవత్సరం కరువు వచ్చినప్పటికీ రాయలసీమకు ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు ..




ఎస్కేపి ఛానల్ (నిప్పుల వాగు)

ఎస్‌కెపి ఛానల్ (నిప్పుల వాగు)

ఈ కాలువ ద్వారా మొదట 11 వేల క్యూసెక్కులు నీరు అందించే సామర్థ్యం కలిగి ఉన్న ఈ కాలువను 35 వేల క్యూసెక్కులు నీరు కింది జిల్లాలకు అందించేందుకు కాలువ విస్తరణ పనులు చేపట్టారు. ఈ కాలువ క్రింద ఆయకట్టు చాలా ఉన్నది ఎస్కేపి ఛానల్ ద్వారా ఈ కాలువ కేసీకినాల్లో కలిసి కుందులో చేరి కింది జిల్లాలకు కండలేరు వరకు సాగునీరు అందించుకుంటూ వెళుతుంది.

తెలుగు గంగ (టిజిపి) కాలువ

ఈ కాల్వ ద్వారా మద్రాస్‌కు తాగునీరు 11వేల క్యూసెక్కుల నీరుఅందించేందుకు కాల్వ సామర్థ్యం ఉంది. మొదట చెన్నైకి తాగునీరు అందించేందుకు ముఖ్య ఉద్దేశం ఉన్నప్పటికీని ఈ కాలువ ద్వారా వెలుగోడు రిజర్వాయర్ అలాగే కింది జిల్లాలకు చెరువులను నింపుకోవడం రాయలసీమ జిల్లాలలో సాగునీరు అందించుకుంటూ చెన్నై వరకు ఈ కాలువ వెళుతుంది. ఇప్పుడు ప్రస్తుతం ఈ కాలువ ద్వారా 15వేల క్యూసెక్కులు నీరు వెళ్లేందుకు లైనింగ్ పనులను చేపట్టారు.



మద్రాస్ కాలువ (టి జి పి)



హంద్రీనీవా సృజన స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

హంద్రీనీవా సృజల స్రవంతి ఎత్తిపోతల పథకం (హెచ్ ఎన్ ఎస్ ఎస్)

హంద్రీనివా సృజన స్రవంతి కర్నూల్ పశ్చిమ ప్రాంతం అనంతపురం చిత్తూరు జిల్లా వరకు పూర్తిగా వర్షాధారమైన వ్యవసాయ భూములకు ఈ ఎత్తిపోతల పథకం ఓ వరం లాంటిది నందికొట్కూర్ డివిజన్లోని మల్యాల నుండి దాదాపు 291 కిలోమీటర్ల ఎత్తుకు కర్నూలు అనంతపురం చిత్తూరు జిల్లా వరకు ఈ కాల్వ వెంట ఎనిమిది పంపులతో కృష్ణా జలాలను తోడిపోస్తూ కరువు సీమను శశ్యామలం చేస్తుంది. ఈ కాల్వ ద్వారా 10 లక్షల మందికి త్రాగునీరు కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకు సాగునీరు అనంతపురం జిల్లాలో 1 లక్ష,18 వేల ఎకరాలకు మొత్తం 1, లక్ష 98 వేల ఎకరాలకు సాగునీరు దాదాపు 120 గ్రామాలలో 10 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ప్రస్తుతానికి ప్రధాన కాలువ ఎనిమిది లిఫ్టుల ద్వారా నీటిని తోసి పోస్తున్నారు. ప్రధాన కాలువకు లైనింగ్ పనులు ప్రస్తుతం చేపట్టలేదు. ఈ నీటి విడుదల ప్రతి సంవత్సరం ఆగస్టు నెల నుండి నవంబర్ వరకు విడుదల చేస్తారు. మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా ఈ నీటిని విడుదల చేస్తారు. 12 పంపులు ఉన్నప్పటికిని అయిదు లేదా ఆరు పంపుల నీరు వెళ్లేందుకే కాల్వ సామర్థ్యం ఉన్నది భవిష్యత్తులో విస్తరణ చేస్తే మరింత నీటిని రాయలసీమ జిల్లాలకు పంపించే అవకాశం ఉంది.

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే మైపర్ లక్ష్యం

-మా సంస్థలో చదివిన వారికి బంగారుభవిష్యత్తు
-న్యాక్ గుర్తింపు సర్టిఫికెట్‌లో అనేక ప్రయోజనాలు
-ప్రజాశక్తితో మైపర్ ఎండి డాక్టర్ ఆదిమూలపు సతీష్



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'మైపర్ పార్మసి కళాశాలలో విద్యార్థులను ప్రయోజకులు తీర్చిదిద్దడానికి కావల్సిన అంశాలను బోధిస్తాం. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ల్యాబ్‌సౌకర్యం, మైదానం, చక్కటి వాతావరణలో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి అన్ని హంగులను ఏర్పాటు చేశాం. అన్నింటికి మించీ మా కళాశాలకు జాతీయ సంస్థ న్యాక్ అక్రిడిటేషన్ గుర్తింపు ఉంది. మాదగ్గర చదివిన విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు దేశంలోని ఆయా పరిశ్రమలలో పని చేయడానికి ఉపయోగపడుతాయి.' అని కర్నూలు ఎక్యాంపులోని మైపర్ కళాశాల ఎండి ఆదిమూలపు సతీష్ తెలిపారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ఆయన మాటల్లో.....

మైపర్ లో బోధనా విధానం ఎలా ఉంటుంది?

ఎండి: మైపర్ లో బోధనా విధానం 5 అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒక అంశాన్ని గుర్తుపెట్టుకునే విధంగా చదువు చెప్పడం. అర్థమయ్యే విధంగా ల్యాబ్ లో చేయించడం. నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టడం. విద్యార్థి ద్వారా ఏదైనా అంశాన్ని విశ్లేషించే విధంగా చేయిస్తాం. విద్యార్థి ద్వారా ఏదైనా విషయాన్ని మూల్యాంకనం చేయిస్తాం. ఈ ఐదు అంశాల ద్వారా విద్యార్థులకు చదువు నేర్పిస్తాం. వీటితోపాటు బోధన సిబ్బందికి ఎప్పటికప్పుడు లేటెస్ట్ టెక్నాలజీ పై అవగాహన కల్పిస్తూ ఎల్‌సిడి ప్రొజెక్టర్లు, టిఎఫ్‌టి మానిటర్లు, ఆధునిక ల్యాబ్లు వంటి నూతన పద్ధతుల ద్వారా విద్యార్థులకు చదువు చెబుతాం. విద్యార్థులకు అనుభవజ్ఞులయిన అధ్యాపకులతో పాఠాలు నేర్పించి , వారికి ప్రాజెక్టులు ఇప్పింస్తాం. అసైన్‌మెంట్ లు ఇచ్చి విద్యార్థిని ఒక సంపూర్ణమైన ప్రొఫెషనల్‌గా తీర్చి దిద్దుతాం. దీనితోపాటు విద్యార్థికి సమగ్రమైన వ్యక్తిత్వ వికాసం , సామాజిక బాధ్యత నేర్పించి మంచి పౌరుడిగా తయారుచేస్తాం. పిల్లలలో స్లో లెర్నర్స్ , అడ్వాన్స్ లేర్నర్స్‌ను గుర్తించి అడ్వాన్స్ లెర్నర్స్ కు సరిపడా కెరీర్ గైడెన్స్ ఇప్పించి స్లో లేర్నర్స్‌ను అచ్చీవర్స్‌గా తీర్చిదిద్దుతాం.

న్యాక్ అంటే ఏమిటి?

ఎండి: నేషనల్ అసెస్‌మెంట్ , అక్రెడిటేషన్ మండలి (NAAC) సంస్థ 'నాణ్యత స్థితి'పై అవగాహన పొందడానికి కళాశాలలు, విశ్వవిద్యాలయాలు లేదా ఇతర గుర్తింపు పొందిన సంస్థల వంటి ఉన్నత విద్యా సంస్థల (HEI) మూల్యాంకనం , అక్రిడిటేషన్‌ను నిర్వహిస్తుంది.న్యాక్ విద్యా ప్రక్రియలు , ఫలితాలు, పాఠ్యప్రణాళిక కవరేజీ, బోధన-అభ్యాస ప్రక్రియలు, అధ్యాపకులు, పరిశోధన, మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు, సంస్థ, పాలన, ఆర్థిక శ్రేయస్సు , వాటి పనితీరు పరంగా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సంస్థలను అంచనా వేస్తుంది.

న్యాక్ అక్రిడేషన్ ఎలా ఇస్తారు?

ఎండి: న్యాక్ అక్రిడేషన్ రావడం అనేది అంత సులభమైన విషయమేమీ కాదు. ఇది చాలా అంశాలన్నీ పరిగణలోకి తీసుకుంటుంది: ఎడ్యుకేషన్ ప్రాసెస్ ఎలా ఉంది. కాలేజీలో ప్లేస్‌మెంట్స్ ఎలా ఉన్నాయి. కరికులం ఎలా మైంటైన్ చేస్తున్నారు. బోధన ఎలా ఉంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎలా ఉంది.రీసెర్చ్ ఏమైనా ఉందా లేదా.ఆర్గనైజేషన్ ఎలా ఉంది.గవర్నెన్స్ ఏంటి.స్టూడెంట్ సర్వీసింగ్ ఎలా ఉంది. వంటి అనేక అంశాలను పరిగణం లోకి తీసుకొని అక్రిడేషన్ ఇస్తుంది. మొత్తం భారతదేశంలో 43000 కాలేజీలు , 900 యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిలో కొన్ని నాణ్యమైన విద్యను అందిస్తాయి మరికొన్ని అందించలేవు. కాబట్టి ఈ న్యాక్ అనే ఆర్గనైజేషన్ ఇండియాలో ఉండే హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ మొత్తం అసెస్‌మెంట్ చేసి వాటికి అక్రిడేషన్ ఇస్తారు. అది కూడా కాలేజ్ స్టార్ట్ అయి 6 సంవత్సరాలు అయి వుండీ లేదా రెండు బ్యాచులు గ్రాడ్యుయేట్ అయ్యి బయటికి వెళితే అప్పుడు ఈ నాక్ ప్రాసెస్‌కు కాలేజీలు అప్లయ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

న్యాక్ అక్రిడేషన్ ఉన్న కాలేజీలో చదివితే విద్యార్థులకు ఎటువంటి ఉపయోగాలుంటాయి?.

ఎండి: న్యాక్ అక్రిడేషన్ కాలేజీ నుంచి వచ్చిన విద్యార్థి సర్టిఫికెట్‌కు మంచి విలువ ఉంటుంది. హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మిషన్స్‌కు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇండస్ట్రీస్ కూడా న్యాక్ అక్రిడేషన్ కాలేజీ నుంచి వచ్చిన విద్యార్థులను తీసుకోవడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతాయి. న్యాక్ అక్రిడేషన్ గల కాలేజీ అంటే అందులో అకాడమిక్స్, ల్యాబ్స్, వర్క్‌షాప్స్, ప్రాజెక్ట్స్ ,ఫ్యాకల్టీ అన్ని స్టాండర్డ్‌గా ఉంటాయని అర్థం.

నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురిస్తుంది

ప్రజాశక్తికి డిఆర్ఒ ఎ. పద్మజ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్



నిష్పక్షపాతంగా నిర్మోహమాటంగా ప్రజాశక్తి దినపత్రిక వార్తలను రాస్తుంది. సాధారణంగా అవస్తవాలు రాయడంలో ప్రజాశక్తి దూరంగా ఉంటుంది. వాస్తవాలకు దగ్గరగా ప్రజా సమస్యలను ఎత్తి చూపడమే లక్ష్యంగా ప్రజాశక్తి వార్తలను ప్రచురిస్తుంది. అనవసరమైన వార్తలు ఉండవు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఈ పత్రిక మరింత ఉన్నతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజాశక్తి సిబ్బందికి, యాజమాన్యానికి శుభాకాంక్షలు ..

కార్మిక హక్కులపై అవగాహన అవసరం

కార్మిక శాఖ సహాయ కమిషనర్ బస్సీరున్నుసా బేగం

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

'కార్మిక చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరం. నంద్యాల జిల్లాలో కార్మిక శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. కార్మిక చట్టాలు.. కార్మిక హక్కులు అమలు తీరును వివరించారు. కార్మిక శాఖలో ఎన్‌పోర్సుమెంటు, ఎపి ఎస్‌సి యాక్ట్, భవన నిర్మాణ యాక్ట్, బీడీ అండ్ సింగర్ వర్కర్స్ యాక్ట్ కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ , వలస కార్మికుల పరిరక్షణయాక్టు, కనీస వేతన చట్టం అమలవుతున్నాయి. ఈ చట్టాల కింద ప్రతి ఫ్యాక్టరీ, వివిధ సంస్థల యాజమాన్యాలు లేబర్ లైసెన్స్ పొందాలి. కార్మికులు ఉన్నా లేకపోయినా కూడా తప్పని సరిగా లేబర్ లైసెన్స్ తీసుకోవాలి. షాపులు ప్రారంభించిన నెలలోపల లైసెన్స్‌లు పొందాలి.' అని కార్మిక శాఖ సహాయ కమిషనర్ బస్సీరున్నిసా బేగం తెలిపారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. ఆమె వివరాల ప్రకారం....

మోటార్ రంగంలో పని చేయించుకునే యాజమాన్యాలు మోటార్ వర్కర్స్ యాక్ట్ ప్రకారం ఐదుగురు, అంతకన్నా ఎక్కువ కార్మికులను పెట్టున్నా వాహనదారులు అలాగే ఆర్‌టిఒ దగ్గర పర్మిట్ పొందిన షో రూమ్‌ల యాజమాన్యాలు కార్మిక శాఖ నుండి లేబర్ లైసెన్స్ పొంది వుండాలి. కాంట్రాక్టు కార్మిక చట్టం కింద 50 మందికిపైగా తమ సంస్థల్లో కార్మికులను తీసుకున్న యాజమాన్యాలు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలి. ఈ లైసెన్స్‌లు పొందడానికి మీసేవలో , లేక గ్రామ వార్డు సచివాలయాల వద్దకు వెళ్లి పొందవచ్చు. ఒక వేల లైసెన్స్ పొందిన సంస్థలు, యాజమాన్యాలు నిర్ణీత సమయంలోగా రెన్యువల్ చేయించుకోవాలి.

ఎపి వెల్ఫేర్ బోర్డు... లేబర్ వెల్ఫేర్ ఫండ్‌ను ప్రతి యాజమాన్యం, సొసైటీలు ఫ్యాక్టరీలు అన్ని రకాల యాజమాన్యాలు ట్రస్టులు, హాస్పటళ్ల క్రమం తప్పకుండా కార్మిక సంక్షేమ నిధికి వెల్ఫేర్ ఫండ్ ను చెల్లించాలి. ఈ ఫండ్‌ను ఆన్ లైన్ ద్వారా , చలానా ద్వారా ఆంధ్ర బ్యాంకులో చెల్లించ వచ్చు. లైసెన్స్ లు తీసుకోని యాజ మాన్యలపైన కార్మిక శాఖా కమిషనర్ ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకోబడుతాయి.

భవన నిర్మాణ యాక్ట్: ఈ యాక్ట్ ప్రకారం ప్రతి నిర్మాణం పైన ఒక శాతం సెస్సు చెలించాలి. కార్మికుల సంక్షేమం కింద ఏదైనా షాపులలో, సంస్థలలో ఫ్యాక్టరీలు, సొసైటీల తదితర యాజమాన్యాలు ప్రతి కార్మికుడు, కార్మికురాలుకి కనీస వేతనాన్ని వారి షెడ్స్ ఎంప్లాయిమెంటును అనుసరించి కనీస వేతనాలు అమలు చేయాలి. కనీస వేతనాలు అమలు చేయలేదని, చెల్లించడం లేదని యాజమాన్యాలపైన ఫిర్యాదులు వస్తే అలాంటి యాజమాన్యాల పైన చర్యలు తీసుకుంటాం.

గ్రాట్యూటీ చట్టం: ఈ చట్టం కింద 10 అంతకన్నా ఎక్కువ మంది ఉన్న సంస్థలలో గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయాలి. యాజమాన్యాలు గ్రాట్యూటి పాలసీని కచ్చితంగా తీసుకోవాలి..

వలస కార్మికుల చట్టం: వలస కార్మిక పరిరక్షణ చట్టం కింద ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులకు ఇక్కడ పని చేయించుకునే యాజమాన్యాలు రక్షణ కల్పించాలి. ముందుగా వలస కార్మికులను పెట్టుకునే సంస్థల యాజమాన్యాలు లైసెన్సులు తప్పనిసరిగా



తీసుకోవాలి. అలాగే వారి కార్మికుల ఆధార్ కార్డు, వలస కార్మికులు ప్రస్తుతం ఉంటున్న అడ్రస్ వివరాలను కార్మిక శాఖకు అందజేయాలి. కార్మికులకుతాము పని చేయించుకునే ప్రదేశాలలో సరైన వసతులు కల్పించాలి.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం: 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట ప్రకారం నేరం. అలా పెట్టుకొని పని చేయించుకుంటున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయొచ్చని ఈ చట్టం చెబుతుంది. యాజమాన్యాలు ఆచి.. తూచి అడుగులు వేస్తూ బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోకూడదు. ఒకవేళ ఏదైనా ప్రమాదకరమైన సంస్థలలో 18 ఏళ్ల వయస్సు గల బాల బాలికలను పనిలో పెట్టుకుంటే వారికి భారీగా జరిమానా కూడా విధిస్తాం.

సమాన పనికి సమాన వేతన చట్టం: ప్రతి ఒక్క సంస్థ యాజమాన్యం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. పనిలో పెట్టుకున్న వారికి ఆడ మగ అని తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన వేతనం ఇవ్వాలని ఈ చట్టం చెబుతుంది.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు: ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు కచ్చితంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో తమ పేరు నమోదు చేసుకోవాలి. 2019 డిసెంబర్ వరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. అదేవిధంగా ఎపి కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమానికి పౌరపాటున అందించారు. పనిచేస్తూ ప్రమాదవశాత్తు ప్రమాదంలో మరణించిన కార్మికుడికి కార్మికురాలికి ఎంప్లాయిస్ కాంపన్ జేషన్ కింద ఆయా పరిశ్రమల నుండి గాని ఫ్యాక్టరీల నుండి, సంస్థల యాజమాన్యాల నుండి నష్టపరిహారం ఇప్పిస్తాం.

ఈ -శ్రమ్ : కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల కార్మికుల కోసం ఈ -శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ప్రతి ఒక్క కార్మికుడు, తన పేరును తప్పకుండా ఈ- శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి.. 28 2021ఆగస్టు 28 నుంచి మార్చి31మధ్యలో ప్రమాదవశాత్తు మరణించి ఈ శ్రమ్ కార్డు పొందిన వారు పిడిడిఆర్‌డిఎ ద్వారా నష్ట పరిహారాన్ని మరణించిన వారి నామినీలు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 8 మందికి ఈ-శ్రమ్ ద్వారా డెత్ బెనిఫిట్ వచ్చింది. పేమెంట్ ఆఫ్ గ్రాట్యూటీ చట్టం కింద గ్రాట్యూటీ రాని కార్మికులు వారి యాజమాన్యలపైన కార్మిక శాఖలో ఫిర్యాదు చేయవచ్చు. క్లెయిమ్ ఫైల్ చేసుకోవచ్చు.

పేమెంట్ ఆఫ్ బోనస్ చట్టం: ఈ చట్టం కింద ఫ్యాక్టరీ యాజమాన్యం 20 మందికి ఎక్కువ కార్మికులు ఉంటే అలాంటి యాజమాన్యాలు కార్మికులకు బోనస్ చెల్లించాల్సి ఉంటుంది. నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు భవన నిర్మాణ సంక్షేమబోర్డులో 78,452 మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. సంక్షేమ బోర్డుకు వివిధ నిర్మాణాలలో పనిచేస్తున్న కార్మికులకు ఆయా యాజమాన్యాల నుండి ఒక శాతం సెస్సు రూపంలో రూ.28 కోట్ల 16 లక్షల, 92 వేల 905 ,వివిధ ప్రయివేట్, రియల్ ఎస్టేట్, వ్యక్తిగత బిల్డింగ్ లు మున్సిపాలిటీలా ద్వారా వచ్చిన సెస్సును ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వ కన్‌స్ట్రక్షన్‌ల ద్వారా రూ.9 కోట్ల46లక్షల 6 వేల 534 ఆన్ లైన్ ద్వారా చెల్లించాం.



పర్యాటకానికి నిలయం కర్నూలు

దేశ విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే సమాహారం కర్నూలు జిల్లా పర్యాటకం. అలనాటి చారిత్రక వైభవాన్ని చాటే కొండారెడ్డి బురుజు, ప్రంపంచ ప్రఖ్యాతి గాంచిన బెలూంగుహలు, ఓర్వకల్లు రాతివనం, అద్భుతమైన నల్లమల అటవీప్రాంతం, కృష్ణా నదిపై నిర్మించిన ఆధునిక దేవాలయంగా పేరొందిన శ్రీశైలం డ్యాం, ద్వాదశజ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన శ్రీశైల మల్లికార్జునుడి ఆలయం, తుంగభద్ర నదీతీరాన మంత్రాలయ రాఘవేంద్రమఠం, నల్లమలలో రుద్రకోడూరు, ఆహోబిలం కొండల్లో నరసింహుడి ఆలయం, యాగంటి, మహానంది తదితర పర్యాటక ప్రదేశాలున్నాయి. ఇలా ఘనమైన, సుదీర్ఘమైన చరిత్ర ఉన్న కర్నూలు జిల్లాలో పర్యటక ప్రదేశాలు ఎక్కువే... అనేక రాజవంశాల పాలన వల్ల మనకు చాలా విలువైన వారసత్వ సంపద, గుళ్లు, గోపురాలు, మసీదులు, చర్చీలు కట్టడాలు వంటి పర్యాటక ప్రదేశాలున్నాయి. (మిగతా వార్త 11లో..)

కొండారెడ్డి బురుజు

ఉమ్మడి కర్నూలు పేరు చెప్పగానే తొలుత కొండారెడ్డిబురుజు గుర్తుకు వస్తుంది. నగర నడిబొడ్డున ఉండే ఈ అపురూప కట్టడం వెనుక వందల యేళ్ల చరిత్ర ఉంది. క్రీ.శ. 1542లో శ్రీకృష్ణదేవరాయల అచ్యుత దేవరాయల కాలంలో నిర్మించారని చరిత్ర కారులు చెబుతారు. నాటి కర్నూలు కోటకు నాలుగు వైపులా ఉన్న బురుజులలో కొండారెడ్డి బురుజు ఒకటి. శిధిలమైన మూడు బురుజుల్లో ఒకదాన్ని ఎర్రబురుజుగా పిలిచేవారు. మిగతా రెండు తుంగభద్రను ఆనుకుని ఉన్నాయి. ఒకటి కుమ్మరి వీధి దాటాక సాయిబాబాగుడి సమీపంలో ఉంది. మూడు బురుజులు శిధిలమైపోయినా కొండారెడ్డి బురుజు మాత్రం పదిలంగా ఉంది. క్రీస్తుశకం 1602-1618 మధ్య కాలంలో బీజాపూర్ సుల్తాన్ ప్రతినిధి అబ్దుల్ వహాబ్ ఈ ప్రాంతాన్ని పాలించే కాలంలో నందికొట్కూరులో ప్రాతకోట పాలెగాడు కొండారెడ్డి ఆయనను ధిక్కరించగా వహాబ్‌తన సైన్యంతో కొండారెడ్డిని ఓడించి బురుజులో కారాగారంలో పెట్టాడని కొందరు చరిత్రకారులు చెబుతారు. ఆంగ్లేయుల కాలంలో కొండారెడ్డి అనే దేశభక్తుడు వారిని ఎదిరించగా అతడిని పట్టి అక్కడే బందించారని మరికొందరు చెబుతారు. ఈ విధంగా ఆబురుజుకు కొండారెడ్డి అనే పేరు వచ్చిందని అంటారు. దీని అసలు పేరు అచ్యుత దేవరాయల బురుజుగా నే పిలిచే వారని అంటారు. ఈ బురుజు కర్నూలు చిహ్నంగానే కాకుండా ఇటీవల సినిమా షూటింగులకు కూడా ఉపయోగిస్తున్నారు.

కర్నూలు ఉస్మానియా కళాశాల సమీపలో ఉన్న అబ్దుల్ వహాబ్ టోంబ్ మనకు కన్పిస్తుంది. దీనిని ఔరంగజేబ్ తన గురువుకు కట్టించిన సమాధి అని చెబుతారు. ఇక్కడ రెండు గమ్మజ్‌లున్నాయి. పెద్దగుమ్మజ్ చాలా అద్భుతమైన ఇంజనీరింగు నైపుణ్యాలు కనిపిస్తాయి. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద గోల్‌గుమ్మజ్ మొదటిది.

మసీదులు - దర్గాలు


1. జామియ మసీదు - ఆదోని
2. వందేళ్ల మసీదు - పత్తికొండ
3. ఎల్లార్తి దర్గాలు -హొళగుంద
4. జగద్గురు ఖాదిర్ లింగస్వామి -కౌతాళం
5. సత్తాల్ హోథిదర్గా - భంభంస్వామిదర్గా
6. రోజాదర్గా - కర్నూలు
7. గోల్‌గుమ్మజ్ - కర్నూలు
8. కర్నూలు నగరంలోని నవాబుల సమాధులు

ప్రకృతి సోయగాలు.. నల్లమల అడవులు

జిల్లాలో పందొమ్మిది శాతం అడవులున్నాయి. నల్లమల పర్వతశ్రేణి శ్రీశైలం నుంచి కడప జిల్లా వరకు 113 కి.మీ మేర ఉన్నాయి. కృష్ణానదికి ఇరువైపులా ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం పులుల అభయారణ్యంగా ప్రకటించింది. ఇక్కడ పులులతో పాటు అనేక వన్య మృగాలు, పక్షులు కనిపిస్తాయి. జీవవైవిద్య పరమైన అనేక క్రిమి కీటకాలు రాక్షససాలీడు లాంటివి కనిపిస్తాయి. ఈ అడవుల్లో, టేకు, వెదురు లాంటి అత్యంత విలువైన కలప ఉంది. ఔషధాల తయారీకి ఉపయోగపడే మొక్కలు అపురూపమైనవి దొరుకుతాయి. గుండ్ల బ్రహ్మేశ్వర అభయారణ్యం ఆత్మకూరు నుంచి బండి ఆత్మకూరు సరిహద్దు వరకు ఉంది. ఇక్కడ ఎర్రచందనం చెట్లు, ఈ ఎర్రచందనం ప్రపంచంలో కేవలం ఆంధ్రప్రదేశ్‌లో, ఈ నల్లమల, శేషాచలం అడవుల్లో మాత్రమే దొరుకుతాయి. ఈ అడవుల్లో, పులుల నుంచి నక్కల వరకు అనేక జంతువులు, పక్షులు మనకు కనువిందు చేస్తాయి. ఇక శ్రీశైలంలో ప్రకృతి దృశ్యాలు చెప్పనక్కర లేదు. చూసి తరించాల్సిందే. ఓర్వకల్లు మండలం కేతవరంలో ఆదిమకాలం నాటి అవశేష చిత్రాలు, ఓర్వకల్లు రాక్‌గార్డెన్స్, వైఎస్ఆర్ స్మృతి వనం, రోళ్లపాడు బట్టమేక పక్షి ఉన్నాయి.

జిల్లాలో కొండలపైన, ముఖ ద్వారాల్లో అనేక దేవాలయాలున్నాయి. శ్రీశైలం, కొలనుభారతి, మాహానంది, అహోబిళం, రుద్రకోటేశ్వర స్వామి, ఓంకారం లాంటి అనేక దేవాలయాలు ఈ అడవుల్లో ఉన్నాయి. జిల్లా అంత ఆవరించిన ఎర్రమలల్లో కూడా అనేక దేవాలయా లున్నాయి. యాగంటి, మద్దిలేటిస్వామి తదితర దేవాలయాలున్నాయి.

బుగ్గ రామేశ్వం స్వామి, రామళ్లకోట దేవాలయం, గండాల చెన్నకేశవాలయం, ఆదోని రణ మండాల ఆంజనేయస్వామి, మాల మల్లేశ్వరం, కర్నూలు సమీపంలోని జగన్నాథగట్టుపైన రూపాల సంగమేశ్వర ఆలయం, ఇంకా ఎన్నో చిన్న చిన్న దేవాలయాలు ఈ కొండలలో ఉన్నాయి. హిందూ సంప్రదాయంలో మూడు మార్గాలైన ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత కేంద్రాలుగా మంత్రాలయం, శ్రీశైలం, అహోబిళం క్షేత్రాలు వర్ధిల్లుతున్నాయి. జైన మతానికి కేంద్రంగా ఆదోని సమీపంలో పెద్ద తుంబళం కేంద్రంగా ఉంది. ఇక క్రైస్తవానికి, ముస్లింలకు సంబంధించిన అనేక కేంద్రాలున్నాయి.



బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం

పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్రను ప్రజలకు తెలియపర్చడంతో పాటు నల్లమల అటవీ ప్రాంతాల్లో నివాసం వుంటున్న చెంచులకు జీవనోపాధి కల్గించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎకోటూరిజం నేడు చక్కటి ఫలితాలను అందిస్తోంది. పర్యాటకరంగం అభివద్ధిలో బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఓ మైలురాయని చెప్పవచ్చు. ఇందుకు కారణం స్వచ్ఛతే కీలకం. 2017 మే 10న బైర్లూటి సమీపంలో నిర్మించిన ఏకో టూరిజం కేంద్రానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ రాజధాని ఢిల్లీ నుంచీ యాత్రికులు తరలివస్తున్నారు. ఐదెకరాల స్థలంలో రూ.82 లక్షల కేంద్రప్రభుత్వ నిధులతో నాలుగు కాటేజీలు, ఆరు టెంటెడ్ గృహాలు, ఒక రెస్టారెంట్, చలి విముక్తికోసం ఫైర్ క్యాంప్, నేచర్ స్టడీ సెంటర్, బట్టర్‌ఫ్లైపార్కు, ఆయుర్వేద వనం, యోగా కేంద్రం, ద్యానమందిరం, ఏర్పాటు చేశారు. చెంచుసాంప్రదాయ క్రీయ విలువిద్య ప్రదర్శనకు ఏర్పాటే చేశారు. ఇక్కడ ఉండాలంటే ఒక రోజు ప్యాకేజీ కింద కాటేజీలకు రూ.4వేలు, టెంటు గృహాలకు రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్యాకేజీతో ఎకో టూరిజం కేంద్రంలో ఒకరోజు విడిది, అటవీప్రాంతంలో సంచారం, ఆహారం సమకూరుస్తారు. టెంటు గృహాల్లో ఎసి సదుపాయం ఉంది. రోజంతా కాలక్షేపానికి ఏర్పాట్లు ఉన్నాయి. నల్లమల పచ్చని అందాలతో పాటు పరిశుభ్రమైన కాటేజీలు, ఆహార పదార్థాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, కనువిందు చేసే జంగిల్ సఫారీ పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ఆశించిన స్థాయిలో ప్రచారం జరగనప్పటికీ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు నల్లమల జంగిల్ సమాఫారి పేరిట ఆన్‌లైన్‌లోనే యాత్రికులు కాటేజీలను బుక్ చేసుకుని బైర్లూటి ఎకో టూరిజం కేంద్రంలో విడిది చేస్తున్నారు. దేశంలోనే టైగర్ రిజర్వు ఫారెస్టు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం, అరుదైన వృక్షజాతులను, వణ్యప్రాణులను, వీక్షించేందుకు 15 కిలోమీటర్ల జంగిల్ సఫారి చేయవచ్చు. ఓపెన్‌టాప్ వాహనంలో పర్యాటకుల్ని నిర్వకులు తీసుకెళ్తారు. అతిప్రాచీన దేవాలయాలు, కోనేరు, మాజీ రాష్ట్ర పతి నీలం సంజీవరెడ్డి , మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ తదితరులు మొక్కలు నాటిన ప్రదేశాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఆరు కిలో మీటర్ల మేర కొండలు, గుట్టలు ఎక్కేందుకు ట్రెక్కింగ్ మార్గాన్ని , అటవీప్రాంత భూమి సారూప్యత, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలను తదితర



వాటిని గురించి తెలుసుకునేందుకు నేచర్ వాక్‌ను అందుబాటులో ఉంచారు.

చెంచుల జీవనానికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. 20 మంది చెంచులను ఎంపిక చేసి టూరిజం కేంద్రానికి సెక్యూరిటీగార్డులు, సఫారి గైడ్స్, అటవీ ఉత్పత్తులను విక్రయించే సిబ్బందిని నియమించారు.

పర్యాటకానికి నిలయం కర్నూలు

అబ్బురపరిచే బెలుంగుహలు



ప్రపంచ ప్రఖ్యాతి గడించిన బెలుంగుహలు 4,500 ఏళ్ల క్రితం ఏర్పడ్డాయి. దేశవిదేశీ యాత్రికులను ఆకర్షిస్తున్నాయి. సందర్శకులను ఈ గుహలు మరో ప్రపంచంలోకి తీసుకెళుతాయి. 1987 రాబర్ట్ పూటే అనే ఆంగ్లేయుడు ఈ ప్రాంతంలో ఖనిజాల కోసం అన్వేషిస్తుండగా ఈగుహలు బయట పడ్డాయి. బెలుం గ్రామం పరిధిలో ఉండటం వలన ఈ గుహలకు బెలుం గుహలు అని పేరు పెట్టారు. 1980 నుంచి 1984 వరకు జర్మనీ దేశానికి చెందిన స్టెలియాలజిస్టు డేనియల్ గేబర్ పరిశోధనలతో ఈ గుహల గురించి ప్రపంచానికి తెలిసింది. సుమారు 270 గుహలను ఆయన గుర్తించారు. ప్రపంచంలో రెండోస్థానం, ఆశియాఖండంలో మొదటి స్థానంలో ఈ గుహలు ఉన్నాయి. ప్రతి వ్యక్తి తన జీవితంలో తప్ప చూడాల్సిన ప్రదేశం ఇది. విజ్ఞానం , వినోదం అందించే ఈగుహలు 1999 వరకు చీకటిలోనే ఉండిపోయాయి. 2000 సంవత్సరంలో ఎపి టూరిజం శాఖ అభివృద్ధి చేసింది. గుహల లోపల వాటర్ ఫౌంటేన్స్, రహదారులు, వంతెనలు, గుహల పరిసరాల్లో పశ్చిక, లైటింగు ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులు పూర్తియ్యాక గుహల సందర్శనకు అనుమతించారు.

గుహలోపల చూడదగినవి: పాతాళగంగ, ఊడలమర్రి , కోటి లింగాలు, సప్తస్వరాలు, ద్యానమందిరం ఉన్నాయి. వాటి ప్రదేశాల్లో ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేశారు. ఈ లైట్లు ప్రతి మూడు నిమిషాలకు ఒకసారి మారుతూ ఆరు రంగుల్లో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. సందర్భకులకు ఉక్కపోత లేకుండా బ్లోయర్లు అమర్చారు. గుహల ఆవరణలో డార్మెటరీ, స్నాక్‌బార్, చిల్డ్రన్ పార్కు ఉన్నాయి. కర్నూలు నుంచి బెలుం గుహలకు 110 కిలోమీటర్లు, బనగానపల్లెనుంచి 35, యాగంటి నుంచి 46, నంద్యాల నుంచి 75, బెంగళూరునుంచి 500, హైదరాబాద్ నుంచి 410 , విశాఖపట్నం నుంచి 600 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు గుహల వద్ద డార్మిటరీ ఏర్పాటు చేశారు. బస్సు సౌకర్యం కూడా ఉంది.

బనగానపల్లె నుంచి బేతంచెర్ల వైపు వెళ్తే నాపరాళ్లు, రంగురాళ్ల గనులను చూడవచ్చు. బేతంచెర్లకు 10 కి.మీ. దూరంలో ప్రకృతి ఒడిలోని మద్దిలేటి స్వామిని లోయలో దర్శించవచ్చు. మద్ది లేరు, ప్రకృతి చాలా అందంగా ఉంటాయి. కోనసీమను తలపించే అందాలను చూడవచ్చు. అక్కడ నుంచి వచ్చి ఓర్వకల్ వద్ద గల ప్రపంచంలోనే రెండో స్థానం ఆసియాలో మొదటిస్థానాన్ని ఆక్రమించిన రాక్‌గార్డెన్స్ వింత అనుభూతినిస్తుంది. కేతవరం రాక్ పెయింటింగ్స్ ఆదిమానవుడు కొన్ని వేల సంవత్సరాల క్రితం ఇక్కడ నివసించేడనడానికి ఆనవాళ్ళు అక్కడ కనిపిస్తాయి. తాండ్రపాడు గుట్టపైన రూపాల సంగమేశ్వరుని గుడిలో గల అద్భుత శిల్పసౌందర్యాన్ని చూడవచ్చు.

- బనగానపల్లెలో నవాబుల కాలంనాటి పాడుపడిన కోట, బ్రహ్మంగారి మఠాలు, కోవెలకుంట్లలోని పాండురంగ స్వామి ఆలయం చూడవచ్చు. బనగానపల్లె నుంచి బెలుంగుహలకు వేళ్లే దారిలో అవుకు రిజర్వాయను చూడవచ్చు.
- బనగానపల్లె నుంచి యాగంటి వెళ్లే రస్తాలోని నవాబు పాతపాడు బంగ్లాను చూడవచ్చు, అక్కడి నుంచి 7 కి.మీ. దూరంలో యాగంటి ఉమమహేశ్వర క్షేత్రం కొండల మధ్య అద్భుతమైన ప్రకృతి ఒడిలో వెలిసింది. ఇక్కడ మూడు అద్భుత గుహలు ఉన్నాయి. దీప స్తంభం పర్యాటలకు అద్భుత అనుభూతినిస్తుంది.



టూరిజం అభివృద్ధికి సూచనలు

గార్గేయపురం చిట్టడవిని ఆహ్లాదకరమైన పెద్దవనంగా కర్నూలు వాసులకు ఆటవిడుపుగా మారుస్తున్నారు. జిల్లా ప్రతి టూరిస్టు కేంద్రంలో ఆటలు, ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేట్లు చూడాలి. దీనివలన వలసలు తగ్గుతాయి. నిర్యోద్యోగ యువతకు ఉపాధి లభ్యమవుతుంది. టూరిజంవలన పల్లీలు అమ్ముకునేవాడి నుంచి 5 స్టార్ హాటల్ వరకు చదువురాని వాడికి, చదువుకున్న వాడికి ఉద్యోగం లభిస్తుంది. ఒక కోటితో పరిశ్రమ పెడితే 5 మందికి ఉపాధి దొరకుకుతుంది. కానీ ఒక కోటితో టూరిజం అభివృద్ధి చేస్తే 44 మందికి ప్రత్యక్ష ఉద్యోగం, నాలుగింతలు పరోక్ష ఉదోగ్యం లభిస్తుంది. టూరిజం అభివృద్ధికి జిల్లాలో అద్భుత అవకాశాలు న్నాయి. వినియోగించుకోవడమే ఆలస్యం.

శ్రీశైలం

భారతదేశంలో ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా శ్రీ భ్రమరాంబ మల్లి ఖార్జున స్వామి ఆలయం. ఈ ఆలయాన్ని దేశ ప్రజలందరూ దర్శిస్తారు. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలందరూ ప్రతి యేటా దర్శిస్తారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు ఎక్కువగా వస్తా రు. కర్నూలుకు 190 కి.మీ. హైదరాబాదు 210 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ ఆలయ మేకాక, శివుడి అవతారాన్ని దర్శింపజేసే నవబ్రహ్మాలయం, ఔషధాలతో నిండిన మల్లికా గుండం, వృద్ధ మల్లిఖార్జున లింగం, సీతాదేవి ప్రతిష్టించిన శివ లింగం పాండవులు ప్రతిష్టించిన శివలింగాలు, సంతానానిచ్చే త్రిపలేశ్వరి వృక్షం, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన భ్రమరాంభాదేవి ఆలయం, అంకాలమ్మ ఆలయం, అక్కమహదేవిబిలం, శివాజీ స్ఫూర్తి కేంద్రం, పాతాళగంగ, నల్లమల కొండల్లో అతి ఎత్తైన శిఖరం, హటకేశ్వరాలయం, పాలధార, పంచధార, ప్రకృతి సిద్ధ జలధార, ఆదిశంకరులు తపస్సు చేసిన చోటు. శివానందలహరి, సాక్షిగణపతి ఆలయం, రోప్‌వే పాతాళగంగకు అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం, చెంచులక్ష్మి మ్యూజియం, నల్లమల అడవుల ప్రకృతి సౌందర్యం, అన్ని విధాల ఈ సౌందర్యం పర్యాటకులను ఆకర్శిస్తున్నాయి.



అహోబిళం : ఇదే నల్లమల్లలో వెలసిన మరో మహోన్నత వైష్ణవ క్షేత్రం. అహోబిల నరసింహస్వామి 16వ శతాబ్ది నాటి నుంచి ఈ క్షేత్రం బహుప్రాచుర్యం పొందింది. నవ నరసింహుడిగా పూజలందుకుంటాడు. ఎగువ అహోబిళం మూల విరాట్ ఉండగా దిగువ కూడిన దేవాలయం ఉంది. శ్రీ కృష్ణ దేవరాయలు ఈ ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈ క్షేత్రం కర్నూలుకు 160 కి.మీ. ఆళ్ళగడ్డకు 28 కి.మీ. దూరంలోని ప్రకృతి ఒడిలోవెలసిన మహిమన్విత దేవాలయం ఆళ్ళగడ్డలో శిల్పాలను చూడవచ్చు. చాగలమర్రిలో అమ్మవారి శాల, అయ్యప్పగుడి, చర్చి చూడవచ్చు.

మంత్రాలయం : జిల్లాలోని ప్రముఖ మఠాల్లో ఒకటి మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం. ఇక్కడికి జిల్లా నుంచి కాక ఎక్కువ కర్నాటక, మహారాష్ట్ర, దేశంలోనే వివిధ ప్రాంతాలను నుంచి వచ్చి సందర్శిస్తుంటారు. తుంగభద్ర నది ఒడ్డున ఉండే ఈ క్షేత్రంలో ఎక్కువగా గురువులు ఆధ్యాత్మిక చింతతో ఉంటారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు చేసి గ్రామ దేవత మాంచాలమ్మను దర్శించుకున్న తర్వాత రాఘవేంద్రుని దర్శనం కల్పిస్తారు.

కొలనుభారతి

దేశంలో మూడో సరస్వతీ ఆలయం కొలను భారతి. ఇది ఆత్మకూరు తాలుకాలో కొత్తపల్లి మండలం, శివపురానికి 3కి.మీ. దూరంలో ఉంది. నల్లమల పాదాలవద్ద చారు ఘోషిని నది ఒడ్డున వెలసిన సరస్వతీ ఆలయం. ఇక్కడ సరస్వతి, శివాలయాలను పునర్మించి ఇంకా అందాలు తీర్చిదిద్దారు.

మహానంది

నల్లమల పాదసీమలో అందమైన ప్రకృతిలో మహానంది ఆలయం వెలసినది. ఈ క్షేత్రం నంద్యాలకు 15 కి.మీ. దూరంలో ఉంది. ఈ క్షేత్రంలో శివలింగం అడుగు నుంచి వచ్చే నీటిధార కొలనులో చేరుతుంది. ఆ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. 365 రోజులు అదే విధంగా ఉంటుంది. ఇంకా అనేక చూడదగ్గ ప్రదేశాలున్నాయి. నల్లమల పాదాల వద్ద, గుండ్లబ్రహ్మేశ్వరం, రుద్ర కోటేశ్వరం, ఓంకారాశ్వరుడు మనకు ఆత్మకూరు నుంచి వెలుగోడు మీ అడవుల్లో కనిపిస్తాయి.

జిల్లాలో టూరిస్టు ప్రదేశాలు

1. దేవాలయాల దర్శనం (పిలిగ్రేమేజి టూరిజం)
2. వారసత్వ పర్యటనలు (హెరిటేజి టూరిజం)
3. సాంస్కృతిక పర్యటనలు (కల్చరల్ టూరిజం)
4. ప్రకృతి పర్యటనలు (ఎకోటూరిజం)
5. వన్యప్రాణి పర్యటనలు (వైల్డ్‌లూరిజం)
6. విశ్రాంతి పర్యటనలు (లీజర్ టూరిజం)
7. గ్రామీణ పర్యటనలు (విలేజి టూరిజం)
8. సాహస పర్యటనలు (ఎడ్వెంచర్ పర్యటనలు)
9. ఆరోగ్య పర్యటనలు (హైల్త్ పర్యటనలు)
10. వేదాంత పర్యటనలు (స్పిర్చివల్ పర్యటనలు)
11. వ్యవసాయ పర్యటనలు(అగ్రికల్చరల్ టూరిజం)
12. విజ్ఞాన పర్యటనలు (ఎడ్యుకేషన్ టూరిజం)
13. సరదా పర్యటనలు (హాబీటూరిజం)
14. క్రీడా పర్యటనలు (స్పోర్ట్ టూరిజం)
15. పుస్తక పర్యటనలు (బుక్స్ టూరిజం)

వారసత్వకట్టడాలు :

బౌద్ధం : రాజుల మందగిరి, ఎర్రగుడి, జొన్నగిరి

జైనం : చిప్పగిరి, పార్శ్వనాథాలయం, పెద్దతుంబలం జైనాలయాలు – ఆదోని

క్రైస్తవ సంస్థలు : పురాత హృదయ మందిరం – ఆదోని ఏళ్ళనాటి మోక్షరాగ్ని మందిరం గూడూరు స్టాంటన్ చర్చి. పురాతన పోలూరు చర్చి, కోల్స్ ఆనంద పురం చర్చి, ఎస్.పి.జి. చర్చి నంద్యాల, కోల్స్ చర్చి – కర్నూలు, జేసునామ దేవాలయం – పెద్దకొట్టాల.

టూరిస్టు క్లస్టర్లు (పర్యాటక ప్రాంతాలు) ప్యాకేజి టూర్స్

కర్నూలు జిల్లాను కొన్ని టూరిస్టు క్లస్టర్లుగా (పర్యాటక ప్రాంతాలు) విభజించాలి. ఆ క్లస్టర్లకు ప్యాకేజీ టూర్స్, రెగ్యులర్ టూర్స్ ప్రోత్సాహించాలి. దీనికి ఎపి. టూరిజం ఆర్‌టిసితో ఒప్పందం చేసుకోవాలి. ఆర్‌టిసి బస్సులు కేటగిరీల మేరకు పర్యాటకులకు అందించాలి. అన్నీ ఎ.సి. లక్జరీ బస్సులంటే, సామాన్య, మధ్య తరగతి ప్రజలు మొగ్గు చూపరు. ఈ విషయాన్ని, టూర్ ఆపరేటర్ల, ఎ.పి. టూరిజం వారు, ఆర్టీసి వారు, ప్రభుత్వం గుర్తించాలి.

టెంపుల్-టూరిజం సర్క్యూట్లకు గ్రహణం : జిల్లాలోని టెంపుల్ – టూరిజం సర్క్యూట్లకు గ్రహణం పట్టిందన్న విమర్శలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టెంపుల్–టూరిజం (ఆలయ–పర్యాటకం) ప్రాజెక్ట్ పరిధిలో ఐదు సర్క్యూట్లను గుర్తించి వాటి పరిధిలో జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలను, పర్యాటక కేంద్రాలను అనుసంధానించారు. కళింగ సర్క్యూట్, విజయనగర కారిడార్, త్రిలింగయాత్ర, అష్టశక్తి యాత్ర, గోల్డెన్ ట్రయాంగిల్ అనే పేర్లతో సర్క్యూట్లను రూపొందించి పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక ప్యాకేజీలను అమలుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు దేవదాయశాఖ, పర్యాటకశాఖలు సమన్వయంగా వ్యవహరించడమే కాకుండా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ, ప్రైవేట్ ట్రావెల్ సంస్థల సహకారం తీసుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలను, పర్యాటక ప్రదేశాలను టెంపుల్ – టూరిజం సర్క్యూట్‌లో చోటు కల్పించారు. విజయనగర కారిడార్ సర్క్యూట్‌లో యాగంటి, బెలుం గుహలు, త్రిలింగయాత్ర సర్క్యూట్‌లో శ్రీశైలం, మహానంది, అహోబిలం, గోల్డెన్ ట్రయాంగిల్ సర్క్యూట్‌లో శ్రీశైలం, యాగంటి, మంత్రాలయం క్షేత్రాలతో పాటు కర్నూలులోని పలు పర్యాటక ప్రదేశాలను గుర్తించారు. కేవలం సర్క్యూట్లలో పర్యాటక, పుణ్యక్షేత్రాలను చేర్చినప్పటికీ యాత్రికులను ఆకర్షించడంలో సంబంధిత శాఖలు విఫలమైనట్లు తెలుస్తోంది. కనీసం ఆయా సర్క్యూట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించలేదనే విమర్శలు ఉన్నాయి.

నిధులు, ప్రచారం, సదుపాయాల కల్పనే కీలకం : పర్యాటక రంగం అభివ ద్ధికి ప్రభుత్వాలు తగిన నిధులను సమకూర్చాలి. ఆ పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని పరిగణలోకి తీసుకుని అక్కడ పర్యాటకులకు అవసరమయ్యే సదుపాయాలను ఏర్పాటు చేయాలి. అంతకంటే ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల గురించి విస్తతమైన ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇవేమీ చేయకుండా మొక్కుబడిగా వ్యవహరిస్తే పర్యాటక అభివ ద్ధి అసాధ్యం. జిల్లాలో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని మినహాయిస్తే.. మిగిలిన అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు సదుపాయాలు లేవు. ప్రధానంగా యాత్రికుల విడిదికి వీలుగా డార్మిటరీలు, రెస్టారెంట్లు, ఆహ్లాదకరమైన ప్రదేశాలు కొరవడ్డాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు రాలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా పర్యాటక ప్రాంతాలకు ఆదాయం తగ్గిపోయింది.

- పానుగంటి చంద్రయ్య, కర్నూలు



శాస్త్రీయతను పెంపొందించాలి

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి

ప్రజాశక్తి-బేతంచెర్ల

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందిన రోజుల్లో కూడా ప్రజలు మూఢ విశ్వాసాలు కలిగి ఉన్నారు. అనేక మంది శాస్త్రవేత్తల కృషి ఫలితంగా పలు ఆవిష్కరణలు జరిగాయి. మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సైన్సు పరిష్కారం చూపుతుంది. సైన్స్ వాస్తవంపై ఆధారపడి పని చేస్తుంది. ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. ఈ నాటికీ కొందరు బూత వైద్యులను, నాటు వైద్యులను సంప్రదించి ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు. మూఢ నమ్మకాలను వీడండి.. శాస్త్రీయత వైపు అడుగులు వేయండి. సంపాదకీయంలో , ప్రపంచ పరిణామాలను వివరించడంలో , లోతైన విశ్లేషణలు ఇవ్వడంలో ప్రజాశక్తికి ఏపత్రిక సాటిరాదు. సామాన్యుల సమస్యలను వివరణాత్మకంగా ప్రచురించే పత్రిక ఇతర పేరున్న పత్రికలతో పాటు సమానంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజలు ఈపత్రికను ఆదరించాలని కోరుతున్నాను. అభివృద్ధికి సేవాదృక్పదంతో సహకరించాలి.



సమాజ రుగ్మతులను ఎత్తిచూపే పత్రిక ప్రజాశక్తి

రాజకుమారి గణియా , జిల్లా కలెక్టర్, నంద్యాల జిల్లా.

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. ఉద్యోగులు, కార్మికులు, ప్రజల పక్షాన ఉంటూ సమాజంలో ఉన్న రుగ్మతలను ఎత్తి చూపుతూ అందరి మన్ననలు పొందుతున్న ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషదాయకం. పత్రికను ఇంకాలం నిర్వహిస్తున్న ప్రజాశక్తి యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు..





